భారత నావికాదళంలోకి ఐఎన్ఎస్ 'అర్నాల' యుద్ధ నౌక

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 317 | విజయవాడ, గురువారం 19 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 19 June 2025 | Rs

'దమ్మిడి' మిగలని 'మామిడి'

- గుజ్జు ఫ్యాక్టరీల వద్ద టోకెన్ల కోసం పడిగాపులు
- అధిక దిగుబడుల వల్లేనని కలెక్టర్ వితండ వాదన

3

ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు

అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వ్యవస్థలో లోపాలను ఉపయోగించుకుని ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదాయ వనరులశాఖల అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పన్నులను ఎగ్గొట్టే వారికి దారులు మూసివేయాలని స్పష్టం చేశారు. బుధవారం ఆదాయ వనరులశాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలపైనా చర్చించారు. ఆదాయంపై కొత్త మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. శాఖలవారీ లక్ష్యాలు, సాధించిన ప్రగతిపైనా అడిగి తెలుసుకున్నారు. పన్నులను సమర్ధవంతంగా రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అయితే వ్యాపారులను వేధింపులకు గురిచేయొద్దని సూచించారు. పన్నులను చెల్లించేందుకు వారిలో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పన్నుల చెల్లింపులు, వాటి

ఆదాయ వనరులపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విధానాలపై 2017 నుంచి ఉన్న సమాచారాన్ని విశ్లేషించాలని ఆయన అధికారులకు సూచించారు. పన్నులు సక్రమంగా చెల్లించేవారికి ఇచ్చే ప్రోత్సాహకాలపైనా పునరాలోచన చేయనున్నట్లు సిఎం చెప్పారు.

పన్నులపై ప్రజాభిప్రాయ సేకరణ

వివిధ రంగాల్లో ప్రభుత్వం విధించే పన్నులపై ప్రజల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజల నుంచి సంతృప్తి రావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఆదాయాన్ని పెంచుకోగలిగితే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

సమీక్షలోనే వీడియోకాన్ఫరెన్స్

సమీక్ష సమయంలోనే పలు మిగతా 7లో

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం

ఎన్నికల హామీలను వేగంగా అమలు చేయాలి

సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశం తీర్మానం

- అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపు
- స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోవాలి
- అందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వేగంగా అమలు చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశం తీర్మానించింది. ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రజలను కోరింది. రెండు రోజులపాటు జరిగే సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం విజయవాడలో ఎంబివికెలో ప్రారంభమైంది. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ నరసింగరావు ఆవిష్కరించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యు వాసుకి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి పాల్గొన్నారు. ఈ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి సావిత్రి, యం హరిబాబు, బి కిరణ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరరావు ప్రవేశపెట్టగా, ప్రతినిధులు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. దీనికి సంబంధించి పూర్తి పాఠం...

సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశ ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు యు వాసుకి, వేదికపై బివి రాఘవులు, వి శ్రీనివాసరావు తదితరులు

తెలుగుదేశం నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 2025 జూన్ 12 నాటికి సంవత్సరం పూర్తయ్యింది. జగన్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ప్రజలు టిడిపి కూటమికి ఎన్నడూలేనంత ఘన విజయం చేకూర్చారు. ప్రజల ఆశలకు తగ్గట్లుగా పాలన లేదు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నది. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నది. మాట తప్పి ప్రజలపై భారాలు మోపుతోంది. ఎన్నికల్లో చెప్పిన హామీలకు విరుద్ధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సంక్షేమ పథకాల అమల్లో కోతలు, ఆస్తిపన్ను పెంపుదలను తక్షణం ఉపసంహరించుకోవాలని, ఇళ్లపట్టాల పంపిణీ వెంటనే చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది.

స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలు అడ్డుకోవాలి

గత వైసిపి ప్రభుత్వం మిగతా 7లో

అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్

- ఉదయ్ సహా ముగ్గురు మావోయిస్టుల మృతి

ఉదయ్

అరుణ

ప్రజాశక్తి -రంపచోడవరం (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేతలు ముగ్గురు మృతి చెందారు. దేవీపట్నం మండలం కింటుకూరు అడవి ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం మేరకు గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ కూంబింగ్‌లో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ఉదయ్, మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు అరుణ, మరో మావోయిస్టు అంజు మరణించారు. దేవీపట్నం మండలం పాపికొండలు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని పోలీసులకు అందిన సమాచారం మిగతా 7లో

అమెరికా, జి-7 యుద్ధోన్మాదాన్ని ఖండించండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు

7

పాలన వదిలేసి కక్ష సాధింపులు

- రెడ్‌బుక్ రాజ్యాంగంతోనే అక్రమ కేసులు
- రెంటపాళ్లలో వైసిపి నేత విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ సిఎం జగన్
- నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు : ఐజి

సత్తెనపల్లిలో అభివాదం చేస్తున్న జగన్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి రాజకీయ కక్ష సాధింపులకు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు సిఎం చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విమర్శించారు. బుధవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో జగన్ పర్యటన దాదాపు ఏడు గంటల పాటు జరిగింది. ఉదయం పది గంటలకు గుంటూరు చేరుకున్న జగన్ ప్రదర్శనగా బయలుదేరి సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు సాయంత్రం ఐదు గంటలకు చేరుకున్నారు. దాదాపు ఆరు గంటలకు పైగా ర్యాలీలో నిలబడే ప్రజలకు జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో బుధవారం సాయంత్రం వైసిపి నాయకుడు నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. 2024లో ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే నాగమల్లేశ్వరరావు ఇంటిపై టిడిపి వారు దాడి చేశారని, పోలీసులు తీవ్రంగా బెదిరించి గ్రామం విడిచి వెళ్లకుంటే రౌడీ షీట్ ఓపెన్‌చేస్తామని ఒత్తిడి చేయడం వల్ల మిగతా 7లో

ఇద్దరు మృతి

జగన్ కాన్వాయ్ సత్తెనపల్లి చేరుకోగానే తీవ్ర తొక్కిసలాట జరిగింది. గడియారం స్తంభం వద్ద జరిగిన తొక్కిసలాటలో జయవర్ధన్ రెడ్డి (32) అనే కార్యకర్త మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జగన్ కాన్వాయ్‌ను అనుసరిస్తున్న వాహనం గుంటూరు ఏటుకూరు రోడ్డులో గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం నుంచి వచ్చిన సిహెచ్. సింగయ్య అనే కార్యకర్తను ఢీకొంది. దీంతో ఆయన తీవ్రగాయాలతో రోడ్డుపక్కన పడిపోయారు.గమనించిన పోలీసులు ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. జగన్ తన పర్యటనలో నిబంధనలు ఉల్లంఘించినందుకు చట్ట ప్రకారం తగిన చర్యలు ఉంటాయని ఐజి త్రిపాఠి, ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు.

ఇరాన్ ఎన్నటికీ లొంగదు!

స్పష్టం చేసిన సుప్రీం నేత ఖమేనీ

- జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం తప్పదంటూ అమెరికాకు హెచ్చరిక
- హైపర్‌సోనిక్ మిస్సైల్‌ను ప్రయోగించిన ఇరాన్
- ఇజ్రాయిల్‌కు సైనిక సాయం చేయొద్దు : అమెరికాను హెచ్చరించిన రష్యా

టెల్ అవీవ్, టెహరాన్ : ఇరాన్ ఎన్నటికీ లొంగిపోదని ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ - ఇరాన్ ఘర్షణల్లో ఒకవేళ అమెరికా జోక్యం చేసుకుంటే 'కోలుకోలేని నష్టం' తప్పదని హెచ్చరించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల హెచ్చరికలు, హత్య బెదిరింపుల నేపథ్యంలో ఖమేని బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. తన రహస్య స్థావరం నుండి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన ప్రసంగాన్ని టివిలో చదివి వినిపించారు.

ఇక యుద్ధం మొదలైంది

ఎక్కడ దాక్కున్నా బేషరతుగా లొంగిపోవాలంటూ ఖమేనిని ట్రంప్ హెచ్చరించారు. ఖమేని ఎక్కడున్నా అమెరికాకు తెలిసిపోతుందని, ఇప్పటికీ ఆయనను చంపే ఆలోచన లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఖమేనీ స్పందిస్తూ ఒక పోస్టు పెట్టారు. 'యుద్ధం మొదలైంది' అని వ్యాఖ్యానించారు. ఖడ్గం పట్టుకొని కోట గేటు వద్ద ఓ వ్యక్తి ఉన్న ఫోటోను ఈ పోస్టుకు జత చేశారు. కోటపై నిప్పుల వర్షం కురుస్తున్నట్లుగా ఆ చిత్రంలో ఉంది.

హైపర్‌సోనిక్ క్షిపణులతో దాడి చేశాం

ఇజ్రాయిల్‌పై బుధవారం తెల్లవారుజామున హైపర్‌సోనిక్ క్షిపణులను మిగతా 7లో

శివకుమార్, ప్రసాద్ సూరిలకు బాల, యువ పురస్కారాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రముఖ సాహితీవేత్తలు గంగిశెట్టి శివకుమార్, ప్రసాద్ సూరిలకు ప్రతిష్టాత్మక బాల, యువ పురస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించింది. బుధవారం నాడిక్కడ కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం అనంతరం 2025 సంవత్సరానికి గాను పురస్కారాల జాబితాను విడుదల చేశారు. తెలుగులో డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత (స్టోరీ)' పుస్తకానికి బాల సాహిత్య పురస్కారం, ప్రసాద్ సూరి రచించిన 'మైరావణ'కు నవలకు యువ సాహిత్య పురస్కారం దక్కింది. నెల్లూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా ఉన్న శివకుమార్ బాలలకు సంబంధించిన రచనలతో గుర్తింపును, పలు పురస్కారాలను అందుకున్నారు. 'మై నేమ్ ఇజ్ చిరంజీవి, బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' తదితర పుస్తకాలను రచించిన ప్రసాద్ సూరి తనను ప్రోత్సహించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 24 భాషల్లో ప్రచురితమైన రచనలకు బాల పురస్కారాలు, 23 భాషల్లో ప్రచురితమైన రచనలకు యువ పురస్కారాలను జ్యూరీ ప్రకటించింది.

కొత్త ప్రాజెక్టులకు సహకరించండి

- అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో లోకేష్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. అమిత్ షాతో భేటీ అయిన మంత్రి లోకేష్ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. ఈ నెల 21న విశాఖలో ప్రధాని మోడీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ కొత్త ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని అమిత్ షాకు అందజేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని అమిత్ షా హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జులై 5న జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పిటిఎం) కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర



ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమైన నారా లోకేష్

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. ఆగస్టులో విద్యాశాఖ మంత్రుల కాంక్లేవ్ ఏర్పాటుకు రాష్ట్రానికి అవకాశం ఇవ్వాలని లోకేష్ కోరగా, అందుకు ధర్మేంద్ర ప్రధాన్ అంగీకరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా టీచర్ బదిలీ చట్టం తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. మనబడి - మన భవిష్యత్తు కార్యక్రమంతో పిఎంశ్రీ స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో 125 ఆటిజం స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఉన్నత విద్య బలోపేతానికి యూనివర్సిటీల్లో ఏకీకృత చట్టం తెచ్చేందుకు కసరత్తు మిగతా 7లో

మధ్యవర్తిత్వానికి అంగీకరించం

- కాల్పుల విరమణపై ట్రంప్‌తో మోడీ చెప్పారు
- విక్రమ్ మిస్రి ప్రకటన

అత్యంత తెలివితక్కువ చర్య!

- అణు విద్యుత్‌కు నిధుల నిషేధం ఎత్తివేతపై ఎడిబికి ఇఎఎస్ శర్మ

7

8 లక్షల మంది అన్నదాతలకు సుఖీభవ కోత

- అర్హతకు అనేక నిబంధనలు
- గతేడాది లబ్ధిదారులతో పోలిస్తే భారీగా కుదింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అన్నదాతా సుఖీభవ పథకం ఎంపికలో ప్రభుత్వం భారీగా కోతలు పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతా సుఖీభవ పథకానికి 45,64,005 మంది రైతులు అర్హత సాధించినట్లు తెలిసింది. వారిలో 44,30,149 మంది రైతుల ఇకెవైసి పూర్తి కాగా.. 1,20,148 మందికి సంబంధించి ఇకెవైసి పెండింగ్ ఉంది. గత ప్రభుత్వం రైతు భరోసా పేరుతో మూడో విడతగా రూ.రెండు వేలును చివరిసారిగా 2024 జనవరిలో 53.58 లక్షల మంది రైతుల ఖాతాలో సొమ్ము జమ చేసింది. దీంతో పోలిస్తే ప్రస్తుతం 7.94 లక్షల మందికి కోత పడింది. సాంకేతిక సమస్యలు, రెవెన్యూ చిక్కులు ఎదురవడంతో లక్షలాది మంది రైతుల వివరాలు పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 72,622 దరఖాస్తులు రెవెన్యూ శాఖ వద్ద అపరిష్కృతంగా ఉన్నాయి.

గత వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన భూ సమగ్ర సర్వే సందర్భంగా అనేక భూ సమస్యలు తలెత్తాయి.

రైతుల నుంచి వేలిముద్రలను సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

అవి ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండడంతో అన్నదాతా సుఖీభవకు దరఖాస్తు చేసేందుకు ఆటంకంగా మారింది. ప్రధానంగా జాయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లు, ఆధార్ అనుసంధానంలో తప్పిదాలు, మ్యుటేషన్లు, మరణించిన వారి పేర్లతో భూమి ఉండడం వంటి సమస్యలను కారణాలుగా చూపి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకే రైతు పేరుతో అధిక విస్తీర్ణంలో భూమి చూపించడం, వెబ్‌సైట్‌లో ఒకరి సర్వే నంబరులో వేరొకరి భూమి నమోదు కావడం తదితర సమస్యలతో ముడిపడి ఉన్న రైతుల వివరాలను తహాశీల్దార్ల లాగిన్‌లకు పంపినా వారు సకాలంలో పరిష్కరించకపోవడంతో వాటిని పెండింగ్‌లో ఉంచారు.

సుమారు రెండు నెలల పాటు లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం కసరత్తు సాగించింది. వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా అధికారులకు రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తొలుత వ్యవసాయ అసిస్టెంట్లు (విఎఎ)లు, మండల వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి తమ పరిధిలోని అంశాల మేరకు అప్రూవల్ తెలిపారు. రెవెన్యూశాఖకు సంబంధించిన అంశాలను తహాశీల్దార్ల లాగిన్‌కు పంపారు. తహాశీల్దార్లకు పంపిన పెండింగ్ రికార్డులను మినహాయించి ప్రభుత్వం అప్రూవల్ అయిన మేరకు జాబితాను రూపొందించింది.

డి-పట్టా, ఆర్ఒఎఫ్ఆర్ సాగుదారులకు సాయం లేనట్టే

గత ప్రభుత్వం డి పట్టా, ఆర్ఒఎఫ్ఆర్ సాగుదారులకు రైతు భరోసా మిగతా 7లో

ఎస్‌సి కార్పొరేషన్ నిధుల మళ్లింపు సరికాదు : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకం కోసం ఎస్‌సి కార్పొరేషన్ నిధులు కేటాయించడం సరైంది కాదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ నిధులను వెనక్కి తీసుకుని చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువతకు బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలిచ్చి, తగిన శిక్షణ ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలకు రూ.25 వేల లోపు ఆదాయం ఉన్నవారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రకటించారన్నారు. ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.25 వేలలోపు ఆదాయం కలిగి ఉన్నా వారికి తల్లికి వందనం పథకం వర్తింపజేయడం లేదన్నారు.

మద్యం కేసులో.. చెవిరెడ్డికి జులై 1 వరకు రిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కేసులో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు జులై ఒకటి వరకు రిమాండ్ విధించింది. దీంతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య 9కి చేరింది. చెవిరెడ్డిని బెంగళూరు ఎయిర్‌పోర్టు ఇమిగ్రేషన్ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకుని విజయవాడ సిట్ పోలీసులకు అప్పజెప్పారు. ఆయనను బుధవారం విజయవాడకు తీసుకొచ్చిన సిట్ అధికారులు సుమారు 3 గంటలకు పైగా విచారించారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు చెవిరెడ్డిని 26 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. కొన్ని ప్రశ్నలకు మౌనం దాల్చగా, మద్యం కేసులో తనకు ఎటువంటి సంబంధం లేదని అధికారులకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. గతంలో అరెస్ట్ అయిన వారి స్టేట్‌మెంట్ల ఆధారంగా ప్రశ్నించేసరికి కొన్ని ప్రశ్నలకు అరకొరగా సమాధానం చెప్పినట్లు తెలిసింది. సాయంత్రం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చెవిరెడ్డితో పాటు ఆయన అనుచరుడు వెంకటేష్ నాయుడుకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆయనను కోర్టుకు తీసుకెళ్లే సమయంలో చెవిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లిక్కర్ కేసులో తన ప్రమేయం లేదని, తనను అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో మొదట్లో తనకు చెప్పలేదని, విచారణకు తాను సహకరిస్తానని చెప్పినప్పటికీ ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో తన పేరు చెప్పాలని తన గన్‌మెన్‌లను వేధించారని చెవిరెడ్డి తెలిపారు. అనంతరం సాయంత్రం ఎసిబి కోర్టులో సిట్ అధికారులు హాజరుపరిచారు. ఆయనకు జులై ఒకటి వరకు ఎసిబి కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం చెవిరెడ్డి, ఆయన అనుచరుడును విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఎపిఇఆర్‌సి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్

- చైర్మన్ పదవి భర్తీ చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)లో ఖాళీగా ఉన్న సభ్యుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్ కమిటీని నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 47ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ బుధవారం విడుదల చేశారు. అదే విధంగా ఎపిఇఆర్‌సి కూడా తన వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ పొందుపరిచింది. సెలక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా రిటైర్డు జడ్జి జస్టిస్ ఎం సత్యనారాయణ మూర్తిని నియమించింది. సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఛైర్‌పర్సన్ ఉంటారు. అర్హులైన అభ్యర్థులు వారి నామినేషన్లను జులై 9వ తేదీలోపు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిరునామాకు పంపాలి. అయితే ఎపిఇఆర్‌సి ఛైర్మన్ పదవిని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా భర్తీ చేయలేదు. కమిషన్‌లో ఛైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులుగా ఉంటారు. అయితే ప్రస్తుతం వెంకటరామిరెడ్డి ఒక్కరే సభ్యులుగా ఉన్నారు. ఆయనే సభ్యులుగా ఉంటూ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా ఉన్నారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌గా 2019లో నియమితులైన జస్టిస్ నాగార్జున రెడ్డి పదవీకాలం ఫిబ్రవరిలో పూర్తయింది. ఆ తరువాత సభ్యులుగా ఉన్న ఠాకూర్ రామ్‌సింగ్ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన పదవీ కాలం కూడా ఇటీవల పూర్తయింది. ప్రస్తుతం వెంకటరామిరెడ్డి ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా ఉన్నారు. సుమారు నాలుగు నెలల నుంచి ఈ పదవిని భర్తీ చేయకుండా కేవలం సభ్యుల నియామకం కోసమే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం వెనుక ఉన్న ఉద్దేశం తెలియడం లేదు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎంహెచ్

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- పోరాటాల్లోనూ పాత్రికేయ రంగంలో విశేష కృషి

ఎంహెచ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాఘవులు, వాసుకి చిత్రంలో వి శ్రీనివాసరావు, పి.మధు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా ఉద్యమ నిర్మాణం, యువతను ప్రోత్సహించడంలో నాయకుడిగా, ప్రజలను చైతన్యం చేయడంలో పాత్రికేయుడిగా మోటూరు హనుమంతరావు బహుముఖ పాత్ర నిర్వహించారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షతన సిపిఎం అగ్రనేత మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతి సభ విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగింది. తొలుత ఎంహెచ్ చిత్రపటానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, యు వాసుకి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. శాసనసభ, శాసనమండలి, రాజ్యసభ సభ్యుడిగా మోటూరు హనుమంతరావు పీడిత ప్రజల తరపున తన గళాన్ని వినిపించారని తెలిపారు. సిద్ధాంతకర్తగా, వక్తగా విప్లవ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ప్రజాపాత్రికేయునిగా విశాలాంధ్ర, అనంతరం ప్రజాశక్తి పత్రికల సంపాదకులుగా ఆయన నిర్వహించిన బాధ్యత చాలా గొప్పదని పేర్కొన్నారు. జై తెలంగాణ, జైఆంధ్ర ఉద్యమ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఉన్నా తెలుగు ప్రజల సమైక్యతపై ఆయన రచనలు దిక్సూచిగా ఉన్నాయని తెలిపారు. జాతీయోద్యమ కాలంలో ప్రజలను చైతన్యం చేయడంలో వాస్తవాలను చెప్పడంలో, దోపిడీ, దుర్మార్గాలను వెల్లడించడంలో ఉద్యమకారులకు పత్రికలే కీలకంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం కొన్ని పత్రికలు స్వభావం మారినా దోపిడీ, అణచివేత కొనసాగినంతకాలం వాటికి వ్యతిరేకంగా ప్రజాపత్రికలు కీలకపాత్ర నిర్వహించాలన్నారు. ఉద్యమ లక్ష్యం, ప్రజల ప్రయోజనం దిక్సూచిగా ఉండే ఏ పత్రికైనా ప్రజల నమ్మకాన్ని చూరగొంటుందని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు మీడియా గొంతునొక్కుతున్నాయని, నిజాలను చెప్పిన వారిని జైలుకు పంపిస్తున్నారని, అటువంటి నిర్బంధాలను ఎదిరించి ప్రత్యామ్నాయ మీడియాను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువతను పోరాటాల వైపు మళ్లించడంలో ఆయన వాగ్ధాటి, విశ్లేషణ మరువలేనివని పేర్కొన్నారు. మోటూరు హనుమంతరావు అల్లుడు, ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ ఎస్ సుధాకర్ మాట్లాడుతూ.. ఆయన జీవించినంతకాలం పార్టీ కోసమే పరితపించారని అన్నారు. ఎంహెచ్ ప్రతిపనిలోనూ ప్రజలను చైతన్యం చేయడం, పార్టీని ముందుకు తీసుకెళ్లడమే కీలకంగా ఉండేదని అన్నారు. నాయకత్వ స్థానంలో ఉన్నా చిన్న కార్మికులకూ అత్యంత విలువ ఇచ్చేవారని చెప్పారు. ఈ సభలో మాజీ ఎంపి పి మధు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి, లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, వి వెంకటేశ్వర్లు, బి తులసీదాస్, వి రాంభూపాల్, సీనియర్ నాయకులు సిహెచ్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి 'పిజిటి'కి 97.33 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సి-2025 నియామక పరీక్షల్లో భాగంగా పిజిటి (నాన్ లాంగ్వేజ్)కి 97.33 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంగ్లీష్ మీడియంలో కామర్స్, ఎస్‌జిటి, పిజిటి సంస్కృతం పరీక్షలకు 41,844 మంది అభ్యర్థులకు 40,726 మంది హాజరయ్యారని డిఎస్‌సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిటి (నాన్ లాంగ్వేజ్) ఇంగ్లీష్ మీడియంలో కామర్స్, ఎస్‌జిటి పరీక్షలకు ఉదయం 20,767 మంది దరఖాస్తు చేసుకోగా, 20,194 (97.24 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఎస్‌జిటి, పిజిటి (లాంగ్వేజ్) సంస్కృతం పరీక్షకు 21,077 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 20,532 (97.41 శాతం) మంది హాజరయ్యారు. 118 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు ఉదయం తూర్పుగోదావరి జిల్లాలో, మధ్యాహ్నం అనంతపురం జిల్లాలో అత్యధికంగా హాజరయ్యారని తెలిపారు.

'ప్రజాశక్తి' అభివృద్ధిలో ఎంహెచ్‌ది కీలక పాత్ర : తులసీదాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, హైదరాబాద్ బ్యూరో

ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధిలో మోటూరు హనుమంతరావు(ఎంహెచ్)ది కీలక పాత్ర అని ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్ అన్నారు. ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎంహెచ్ 24వ వర్ధంతి కార్యక్రమం తాడేపల్లిలోని ప్రజాశక్తి భవనంలో బుధవారం జరిగింది. ఆ పత్రిక సిజిఎం వై అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తులసీదాస్ మాట్లాడుతూ విజయవాడలో ఒక ఎడిషన్‌తో మొదలైన ప్రజాశక్తి రెండు రాష్ట్రాల్లోనూ పలు ఎడిషన్లతో విస్తరణకు, పాఠకులకు చేరువయ్యేందుకు ఎంహెచ్ మార్గం చూపించారని చెప్పారు. పత్రిక కోసం ఆయన అనేక త్యాగాలు చేశారని అన్నారు.'ప్రజాశక్తి' ప్రతి అక్షరం ప్రజల పక్షమనే నినాదాన్ని అమలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని, అదే ఎంహెచ్‌కు ఇచ్చే నివాళి అని అన్నారు.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి పునాది మోటూరు : తెలకపల్లి రవి

ఆశయ బలమున్న అక్షరాలకు మోటూరు హనుమంతరావు అద్యుడని ప్రజాశక్తి మాజీ సంపాదకులు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలిపారు. మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోటూరు విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నవ తెలంగాణ దినపత్రిక సంపాదకులు రాంపల్లి రమేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి మాట్లాడుతూ అక్షరాల యోధుడుగా ఉంటూనే ఉద్యమాలు చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి మోటూరు అని గుర్తుచేశారు. ప్రజాశక్తి నిలదొక్కుకోవడానికీ, పురోగమనానికి మోటూరు ఒక వ్యక్తిగా, శక్తిగా నిలబడ్డారని తెలిపారు. ప్రజాశక్తిని నైజాం నిషేధించిన కాలం నుంచి సంపాదకునిగా వివిధ రకాలుగా సేవలందించి పత్రికను నిలబెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ పత్రిక జనరల్ మేనేజర్లు, ప్రజాశక్తి, నవతెలంగాణ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 లక్షలు కట్టాకే పిల్‌పై విచారణ

- మాజీ ఎంపి హర్షకుమార్‌కు తేల్చి చెప్పిన హైకోర్టు
- ప్రవీణ్ పగడాల మృతిపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యకు గురయ్యారనేందుకు ఆధారాలు ఏమున్నాయో చెప్పాలని పిటిషనర్ అయిన మాజీ ఎంపి హర్షకుమార్‌ను హైకోర్టు నిలదీసింది. ప్రవీణ్ హత్యకు గురయ్యారని, హత్య ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశాలు జారీ చేయాలనే పిల్‌ను విచారణ చేయాలంటే హర్షకుమార్ రూ.5 లక్షలను రిజిస్ట్రీ వద్ద డిపాజిట్ చేయాలంది. ఇదే అంశంపై ఇప్పటికే దాఖలైన ఇతర పిల్స్‌తో కలిపి ఈ వ్యాజ్యాన్ని కూడా కలిపి విచారణ చేస్తామంది. విచారణను వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. మద్యం షాపు దగ్గర ప్రవీణ్ ఉన్నట్లు, ఆ తర్వాత ద్విచక్ర వాహనాన్ని నడిపినట్లుగా ఆధారాలున్నాయని, ఆ రెండింటితో ఉన్న వ్యక్తికి ఏమవుతుందో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించింది. న్యాయ విచారణ కోరడానికి పిటిషనర్ మృతుడి కుటుంబ సభ్యుడు కాదు కదా? అని ప్రశ్నించింది. పిటిషనర్, మృతుడు ఒకే మతానికి చెందిన వారని న్యాయవాది బాలయ్య చెప్పిన జవాబుపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇప్పటికే పిల్స్ దాఖలై ఉండగా మళ్లీ పిల్ దాఖలు చేయాల్సిన అవసరం ఏమిటని అడిగింది. మాజీ ఎంపి అయితే ఏమిటని కూడా ప్రశ్నించింది. న్యూఢిల్లీ ఎయిమ్స్ ఫోరెన్సిక్ నిపుణులతో రీ పోస్టుమార్టం నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని బాలయ్య కోరారు.

జత్వానీ కేసులో పిఎస్‌ఆర్‌కు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

సినిమా యాక్టర్ కాదంబరి జత్వానీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్‌ఆర్ ఆంజనేయులుపై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలు హైకోర్టు నిలిపివేసింది. ఇదే కేసులో పలువురు పోలీసు అధికారులు దాఖలు చేసిన పిటిషన్లతో కలిపి పిఎస్‌ఆర్ వేసిన వ్యాజ్యాన్ని కలిపి విచారణ చేస్తామంది. విచారణను ఈ నెల 30కు వాయిదా వేస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ బుధవారం ఆదేశాలిచ్చారు. జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ పిఎస్‌ఆర్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే తరహాలో ఐపిఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, ఇతర పోలీసు అధికారులు వేసిన కేసులను విచారించిన హైకోర్టు వారిపై కూడా కేసు తదుపరి చర్యలు చేపట్టరాదని ఉత్తర్వులు జారీ చేసింది.

మోడీ మెప్పుకోసమే!

- 20,21 చేపల వేట బంద్, స్కూళ్లకు సెలవులు
- 25వేల మంది గిరిజన పిల్లలతో ఎయులో సూర్యనమస్కారాలు

ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ మెప్పు కోసమే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'యోగా' పేరుతో కేంద్రానికి సాగిలపడుతున్నారన్నది విశాఖలో జరుగుతోన్న పనుల తీరు పట్టిచూపుతోంది. ఈనెల 21న విశాఖ సాగర తీరం నుంచి భీమిలి వరకూ రోడ్డు మార్గంలో 11వ అంతర్జాతీయ యోగా విన్యాసాల కోసం 'మత్స్యకారులను సముద్రంపైకి వెళ్లకుండా రెండు రోజుల పాటు నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం విధించినట్లు విశాఖ జిల్లా అధికారులు చెబుతున్నారు. అలాగే రెండు రోజుల పాటు స్కూళ్లకు సెలవులను ప్రకటించారు. ఇప్పటికే సాగర తీరం అంతా ఆంక్షలు తీవ్రస్థాయిలో అమలవ్వడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తుతోంది. ఒక గంట విన్యాసాల కోసం ఇంత చేయడం సరైనదేనా? అన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా విశాఖ నగరంపై ఉగ్రవాదులు దాడి చేసే అవకాశం, గతంలో అనేకమార్లు సముద్ర మార్గం గుండా వచ్చే యత్నాలు వంటివి ఉన్న అనుభవాల రీత్యా చేపల వేటపై వేటు వేశారు. విశాఖలోనే సుమారు ఐదు లక్షల మంది జనాన్ని సాగర తీరానికి వివిధ వాహనాల్లో తరలించే పని కూడా భద్రత రీత్యా సరైంది కాదన్న అభిప్రాయం మేధావుల్లోనూ, కొంతమంది అధికారుల్లో సైతం వ్యక్తమవుతోంది. తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రం (నేవల్ బేస్) విశాఖ సొంతం. కీలకమైన పోర్టు, స్టీల్‌ప్లాంట్, నెల్కో వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు విశాఖపట్నం నెలవు. ఈ తరహా భారీ జన సమీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగర తీరంలో ఏర్పాట్లు చేయడం అంటే భద్రత దృష్ట్యా మంచిది కాదన్నది జగద్విదితమైన సత్యం. ఇటీవల దేశంలోని పహల్గాం దాడి నేపథ్యంలో విశాఖ భద్రత విషయంలో పటిష్ట చర్యలు కానరావడం లేదు.

25 వేల మంది గిరిజనుల తరలింపు

యోగాంధ్ర రికార్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం పడరాని పాట్లు పడుతోందని చెప్పొచ్చు. 'ఎవ్వరేమనుకున్నా మోడీకి మాటిచ్చాం.. అది నెరవేరాలి' అన్న రీతిలో చంద్రబాబు, మంత్రులు, అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది. 21న యోగా డే లో విన్యాసాల కోసం విశాఖ ఏజెన్సీ నుంచి 25 వేల మంది విద్యార్థులను ఆంధ్రా యూనివర్శిటీకి ప్రభుత్వం తీసుకొని వస్తోంది. అధికారులు ఈ ఏర్పాట్లలో నిమగ్న మయ్యారు. వీరి చేత సూర్యనమస్కారాలు చేయించి మోడీ మెప్పు పొందాలన్నదే వీరి తాపత్రయం. వచ్చే వారికి కనీస వసతులు, సదుపాయాల గురించి చర్చ ఎక్కడాకానరావడం లేదు. విశాఖ సాగర తీరంలో ఐదు లక్షల మంది వస్తే ప్లాస్టిక్ వేస్ట్ (వాటర్ బాటిల్స్ వగైరా) కూడా విపరీతంగా వినియోగించే అవకాశం లేకపోలేదు. యోగాంధ్ర కోసం స్వచ్ఛాంధ్ర భావనకు తూట్లు పొడిచేలా ప్రభుత్వ తీరు ఉందంటూ జివిఎంసికి చెందిన ఒక అధికారి తాజాగా వ్యాఖ్యానించడం ఈ సందర్భానికి సరితూగుతోంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి సిఎస్సార్ నిధులు?

అధికారికంగా రూ.62కోట్లు యోగాంధ్ర నిర్వహణ కోసం ఖర్చవుతుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఇటీవల వెల్లడించారు. ఇప్పటికే రూ.20కోట్లకు పైగా విడుదల చేశారు. ఈ ఖర్చు సుమారు రూ.180 కోట్ల నుంచి రూ.200 కోట్లకు పెరిగే అవకాశాలు న్నాయని అధికారులు చెబుతున్నారు. విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) నిధుల వసూళ్లకు దిగే అవకా శాలు లేకపోలేదు. ఈ విషయంపై జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయులు బుధవారం విశాఖలో మీడియాతో మాట్లాడుతున్న సందర్భంలో కేంద్రం సాయం ఎంత చేసింది అనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. కేంద్రం ఇస్తుంది.. అంటూ దాటవేశారు.

కాకినాడలో మూడు రోజులు సెలవులు

విశాఖపట్నంలో ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లాలో పలు ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచాలి : చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచాలని, పొగాకు, మామిడి పంట ఉత్పత్తులకు సంబంధించి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని సిఎం చంద్రబాబు తెలిపారు. పంట ఉత్పత్తులను వాణిజ్య కోణంలోనే చూడాలని, వీలైనంత మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో మామిడి, కోకో, పొగాకు పంటల మద్దతు ధరలపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది హెచ్‌డి బర్లీ పొగాకు 80 మిలియన్ కేజీల మేర ఉత్పత్తి వచ్చిందని, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 27 మిలియన్ కేజీలు పోగా, మిగిలిన 53 మిలియన్ కేజీల హెచ్‌డి బర్లీ పొగాకును త్వరగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మామిడికి కిలో రూ.4 అదనంగా మద్దతు ధర ఇస్తున్నామని, ప్రాసెసింగ్ యూనిట్లు రూ.8లకు తగ్గకుండా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. మరో వైపు ఈ ఏడాదిలో కోకో 12 వేల మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి వచ్చిందని, అందులో ఇప్పటికే 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జులై మొదటి వారానికి మిగిలిన ఉత్పత్తిని కూడా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరమైనట్టుగా ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలు అమలు చేయాలని ఆయన సూచించారు. 53 మిలియన్ కేజీల హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోలులో 33 మిలియన్ కేజీల పొగాకును 24 కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. మరో 20 మిలియన్ కేజీల పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యానశాఖల ఉన్నాతాధికారులు పాల్గొనగా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అన్నదాతలు దూరం

- జాయింట్ ఎల్‌పిఎమ్‌లతో ఇబ్బందులు
- మానిటరింగ్ కోసం నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం వైపు సరైన మార్గనిర్దేశం లేకపోవడం, అధికారుల నిర్వాకం వెరసి అన్నదాతలను సంక్షేమ పథకాలకు దూరం చేసింది. భూముల రీసర్వే పేరుతో గత ప్రభుత్వంలో సరైన సమయం ఇవ్వకుండా రీసర్వే పూర్తి చేయాలంటూ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లపై ఒత్తిడి తీసుకురావడం ఇందుకు కారణమైందనే వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వం తాజాగా అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హుల ఎంపిక ప్రక్రియలో గతంలో రీసర్వే పూర్తికాగానే ఒకే సర్వే నెంబర్‌లోని 5 నుంచి 8 మంది వరకు ఉన్న భూ యజమానులు వేర్వేరుగా ల్యాండ్ పార్శిల్ మ్యాపింగ్ (ఎల్‌పిఎమ్) నెంబర్లు కేటాయించకుండా, హడావుడిగా అందరికీ ఒకే జాయింట్ ఎల్‌పిఎమ్ నెంబర్లు కేటాయించడంతో ప్రభుత్వం సూచించిన పదెకరాల విస్తీర్ణం మించిపోతోంది. ఫలితంగా రైతులు ప్రభుత్వ పథకాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులకు అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం పథకం పొందేందుకు అర్హత కల్పించే పేరుతో జాయింట్ ఎల్‌పిఎమ్‌లను వేరు చేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఉత్తరాంధ్రకు నోడల్ ఆఫీసరుగా జాయింట్ డైరెక్టర్ ఎ నిశాంత్‌రెడ్డిని, దక్షిణాంధ్రకు మరో అడిషనల్ డైరెక్టర్‌ను ప్రభుత్వం నియమించింది. అడిషనల్ డైరెక్టర్ ఎవరనేది ప్రకటించాల్సి ఉంది.

10 రోజుల్లో 5.81 లక్షల జాయింట్ ఎల్‌పిఎమ్‌లు విడగొట్టడం సాధ్యమేనా?

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో గ్రామ సభల ద్వారా 5,81,606 జాయింట్ ఎల్‌పిఎమ్‌లు సృష్టించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక్కో జాయింట్ ఎల్‌పిఎమ్ కింద కనీసం ఐదుగురు కంటే ఎక్కువ భూ యజమానులు ఉంటారని ఓ అంచనా. ఏ భూ యజమానికి ఆ భూమికి సంబంధించిన విస్తీర్ణంతో ల్యాండ్ పార్శిల్ మ్యాపింగ్ (ఎల్‌పిఎమ్)లు క్రియేట్ చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షలకు పైగా అన్నదాతలు ప్రభుత్వ పథకాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నదాతలకు ప్రభుత్వ పథకాలు పొందేందుకు వీలుగా అంటూ ఈ నెల 19 నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆచరణలో ఇది సాధ్యమయ్యేనా అని రెవెన్యూ ఉద్యోగులు మదనపడుతున్నారు.

గ్రీవెన్స్‌కు గడువు 48 గంటలే

అలాగే తల్లికి వందనం పథకం రాని తల్లులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గ్రీవెన్స్‌లో ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. గ్రీవెన్స్‌లో అర్జీలు సమర్పించేందుకు మరో 48 గంటలు మాత్రమే సమయం ఉండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 16 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తులు సచివాలయాల్లో ఇవ్వాల్సి ఉంటుంది. 21 నుంచి 28 వరకు అర్జీల వెరిఫికేషన్, 30న 1వ తరగతి, ఇంటర్ అర్హుల జాబితా ప్రదర్శన, జులై 5న మిగిలిన అర్హులకు నగదు జమ అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సమస్యలు ఉత్పన్నమవుతాయంటున్న ఉద్యోగులు

భూముల రీసర్వే సమయంలో వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తులు, ఎటువంటి డాక్యుమెంట్ లేకపోయినా ఆయా భూములు గత కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నట్లు గ్రామసభలో గ్రామస్తులు, ఇరుపొరుగువారు ధ్రువీకరించిన వారికి సైతం జాయింట్ ఎల్‌పిఎమ్‌లో చోటు కల్పించారు. తాజాగా ఎవరి భూమి వారికి ప్రత్యేక ఆన్‌లైన్ ద్వారా ఎల్‌పిఎమ్ సృష్టించాలంటే ఆ భూ యజమానికి భూమి ఎలా సంక్రమించింది? అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, కొనుగోలు ద్వారా అయితే సంబంధిత రిజిస్ట్రేషన్ కాగితాలు సమర్పించాల్సి ఉంటుందని, ఇది ఆచరణలో సాధ్యం కాకపోవచ్చని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఎల్‌పిఎమ్ చేయాలంటే ఆయా భూములను సబ్ డివిజన్ చేయాల్సి ఉంటుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2025కు ఎంట్రీల ఆహ్వానం...

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు జర్నలిజంలో ప్రతిష్టాత్మకమైన మోటూరు హనుమంతరావు (ఎంహెచ్) స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు ఎంట్రీల కోసం ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ప్రకటన విడుదలైంది. ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవిఎస్ శర్మ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో 'మోటూరు హనుమంతరావు (ఎంహెచ్) స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2025'కు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ వార్తా కథనాలు, ఫీచర్లు రాసిన వారిని గుర్తించి అభినందించడానికి సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి నేతృత్వంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసరు జి అనిత, సీనియర్ జర్నలిస్ట్, కవి నల్లి ధర్మారావుతో కూడిన ఎంహెచ్ అవార్డు కమిటీ నిర్ణయించిందని తెలిపారు. గత కొన్నేళ్లుగా అప్రతిహతంగా సాగుతున్న ఈ బృహత్తర ప్రయత్నంలో భాగంగా ఈ ఏడాది కూడా ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు ఎంవిఎస్ శర్మ తెలిపారు. 2025 జూన్ 30లోగా ఎంట్రీలు తమకు చేరేలా పంపాలన్నారు.

బాధాసర్పదష్టుల కథనాలే....

'మహిళలు, పిల్లలు, దళితులు, వికలాంగులు, బడుగు, బలహీనవర్గాలు, అల్పసంఖ్యాక వర్గాలు, సమాజంలో వీరి సమస్యలు, సవాళ్లు ప్రత్యేకమైనవి. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రకటిస్తున్నా ప్రగతి పరిమితంగానే ఉంటోంది. ఆయా వర్గాలు అత్యధికంగా అసమానతలు, అత్యాచారాలకు, ఆధిపత్యాలకు బలయ్యే ఘటనలు వింటూనే ఉన్నాం. పత్రికల్లో వీరి సమస్యలపై ఎప్పుడూ ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో విలేకరుల పాత్ర కీలకం. సమాజంలో ఇతరులతో పాటు వారికీ సమానస్థాయి కల్పించడానికి జర్నలిస్టులు కృషి చేస్తూనే ఉన్నారు. అయినా బయటకు రాని వాస్తవాలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా తరగతులకు సంబంధించిన ఉత్తమ వార్త కథనాలు, ఫీచర్లు రాసిన వారిని ఈ ఏడాది గుర్తించి అభినందించనున్నాం' ' అని ఎంవిఎస్ శర్మ తెలిపారు.

ఎంట్రీలు ఎలా పంపాలి?

ఎంట్రీలు పంపదలచిన వారు కార్యదర్శి, ప్రజాశక్తి సాహితీ సంస్థ, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, పిన్‌కోడ్ 522501 నెంబరుకు కానీ, లేక psmhaward@gmail.com మెయిల్‌కు పంపాలన్నారు. కథనాలు 2024 జూన్ ఒకటి నుంచి 2025 మే 31 మధ్యలో తెలుగు పత్రికల్లో ప్రచురితమై ఉండాలన్నారు. న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమని, ఎంపికైన వారికి ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

'దమ్మిడీ' మిగలని 'మామిడి'

గుజ్జు ఫ్యాక్టరీల వద్ద టోకెన్ల కోసం పడిగాపులు
తమ వంతు కోసం వారాల తరబడి రైతుల ఎదురుచూపులు
అధిక దిగుబడులు వచ్చాయని కలెక్టర్ వితండ వాదన

గుడిపాల గుజ్జు ఫ్యాక్టరీ ఎదుట పర్మిట్ల కోసం బారులు తీరిన ట్రాక్టర్లు

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి)

ఆరుగాలం కష్టపడి.. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను దక్కించుకున్న మామిడి రైతులు...తీరా ఆ పంటను విక్రయించుకునేందుకు కూడా నిద్రాహారాలు మాని ఫ్యాక్టరీల వద్ద వారాల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కష్టనష్టాలకోర్చి పండించిన పంటకు 'దమ్మిడి' ఆదాయం కూడా మిగలడం లేదని రైతులు కన్నీంటి పర్యంతమవుతున్నారు. మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులు పంటను కొనుగోలు చేయకపోవడం, ముందు వచ్చిన వారి పంటను ముందుగా తీసుకుంటామని టోకన్ల పద్ధతి ప్రవేశ పెట్టడంతో ట్రాక్టర్లు, ట్రక్కులతో ఫ్యాక్టరీలకు తమ పంటను రైతులు తీసుకువచ్చారు. టోకెన్ల జారీ అయిపోయిందని బోర్డులు పెట్టడంతో మరల తమ వంతు వచ్చే వరకూ అక్కడే నిద్రాహారాలు మాని రైతులు ఎదురుచూస్తున్నారు. పంట అధిక దిగుబడులు రావడానికి రైతులు వాడిన అధిక ఎరువుల వినియోగం, రుతుపవనాల ప్రభావం కారణమని తిరుపతి జిల్లా కలెక్టర్ వితండ వాదన చేస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల్లో మామిడి సాగు అవుతుంది. ఇందులో తోతాపురి 99,737, నీలం 14545, అల్ఫోనో 7817, బెనిష 9737, మల్లిక 4350 ఎకరాలు, ఇతర రకాలు 3815 ఎకరాల్లో సాగవుతుంది. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా తోతాపురి రకం కాయలు 90 శాతం పక్వానికి వచ్చేశాయి. జిల్లావ్యాప్తంగా 99,737 ఎకరాలకు గాను 4,99,274 మెట్రిక్ టన్నుల వరకూ దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. తోతాపురి పంటను ఫ్యాక్టరీలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. దీంతో రైతులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం స్పందించి కిలో రూ.ఎనిమిది చొప్పున కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలను ఆదేశించింది. ప్రభుత్వం తరపున మరో నాలుగు రూపాయల చొప్పున ప్రోత్సాహక నిధి ఇస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అధికారుల పోరు పడలేక కొన్ని ఫ్యాక్టరీలు కాయల కొనుగోలుకు అనుమతులు ఇచ్చింది. ముందు వచ్చిన వారి పంటను ముందుగా తీసుకుంటామని టోకన్ల పద్ధతి ప్రవేశ పెట్టడంతో ట్రాక్టర్లు, ట్రక్కులతో ఫ్యాక్టరీలకు తమ పంటను రైతులు తీసుకువచ్చారు. గుడిపాల మండలంలోని ఆర్ఆర్ఎం జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం టోకెన్లు ఇవ్వడం నిలిపివేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. పర్మిట్లు ఎక్కువ మొత్తంలో జారీ చేశామని, అవి పూర్తయిన తరువాత మళ్లీ ఇస్తామని ఫుడ్ అండ్ ఇన్ ఫ్యాక్టరీ ప్రకటించింది. గంటల తరబడి నిరీక్షించిన రైతులు చివరకు ఫ్యాక్టరీ ఎదుట నిరసనకు దిగారు. చిత్తూరు గంగసాగరం ఫ్యాక్టరీలో మామిడి కొనుగోలుకు టోకెన్లు జారీ చేస్తున్నారని ప్రకటించడంతో మామిడి రైతులు ఆదివారం అర్ధరాత్రి నుంచే ఫ్యాక్టరీ వద్దకు రైతులు చేరుకున్నారు.

సోమవారం ఉదయం ఐదు గంటల సమయానికి వందలాది రైతులు టోకెన్ల కోసం గుమిగూడారు. టోకెన్లు పంపిణీ చేయకపోగా గేట్లు మూసివేయడంతో రైతులు కర్మాగారాన్ని చుట్టుముట్టారు.

తమిళనాడు మామిడికి అధిక ప్రాధాన్యత

తమిళనాడు నుంచి వచ్చే తోతాపురి మామిడి పంటకు ఫ్యాక్టరీ యజమానులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అక్కడి కిలో రూ. నాలుగు నుంచి ఐదు రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడు వ్యాపారులు ఐదు రూపాయలకే చిత్తూరు జిల్లాలోని ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నారు. దీంతో చిత్తూరు జిల్లా రైతులకు ఎనిమిది రూపాయలు ఎందుకు ఇవ్వాలన్నది ఫ్యాక్టరీ యాజమాన్యం వాదన. అయితే రూ.ఎనిమిది కొనుగోలు చేయాలని ప్రభుత్వం ధర నిర్ణయించడం, అది అమలు కాకపోవడంతో జిల్లా రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అతి కష్టం మీద కొన్నిచోట్ల మాత్రమే ఫ్యాక్టరీలు టోకెన్లను జారీ చేస్తున్నాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తోతాపురి రకం మామిడి పంట అధిక దిగుబడులు రావడానికి కారణం రైతులు వాడిన అధిక ఎరువుల వినియోగం, రుతుపవనాల ప్రభావం కారణమని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వితండ వాదన చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి మామిడి చేరడంతో ఆ పల్ప్ నిల్వ ఉండిపోయిందన్నారు. ఎక్కడైనా ప్రాసెసింగ్ యూనిట్ వారు రైతులకు ఏదైనా ఇబ్బందులు కలిగించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గుజ్జు ఫ్యాక్టరీల ముందు పరిస్థితిని సమీక్షించడానికి రెండు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. తోతాపురి మామిడి రైతులకు సహాయార్థంగా జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

బాధితురాలికి రూ.ఐదులక్షల చెక్కును అందిస్తున్న కడ పీడీ

'కుప్పం'బాధితురాలికి 50 సెంట్ల స్థలం

- రూ. ఐదు లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి- కుప్పం రూరల్

చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేసిన ఘటన అమానవీయమని, బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని ఎపిఎస్ఆర్‌టిసి వైస్‌చైర్మన్ మునిరత్నం తెలిపారు. కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ (కడ) కార్యాలయంలో ముఖ్యమంత్రి తరపున బాధితురాలికి రూ.ఐదు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ.. బాధితురాలి పిల్లల చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వడ్డీ వ్యాపారుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యహరిస్తోందన్నారు. కడ పిడి మాట్లాడుతూ... బాధితురాలికి కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 50 సెంట్ల భూమి కేటాయింపుకు అసైన్డ్ కమిటీ తీర్మానించడం జరిగిందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారని చెప్పారు. బాధితురాలికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు

నావికాదళంలోకి ఐఎన్ఎస్ 'అర్నాల' యుద్ధ నౌక

ఐఎన్ఎస్ అర్నాల యుద్ధనౌకను ప్రారంభిస్తున్న అనిల్ చౌహాన్ తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

డైరెక్టరేట్ ఆఫ్ షిప్ ప్రొడక్షన్ మార్గదర్శకత్వంలో కోల్‌కతా కట్టుపల్లిలో తయారు చేసిన మొదటి యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌక ఐఎన్ఎస్ అర్నాల బుధవారం ఉదయం భారత నావికాదళంలోకి ప్రవేశించింది. విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ హాజరై నౌకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం సమర్ధవంతమైన నావికాదళాన్ని రూపొందించడం ద్వారా గణనీయమైన సముద్ర శక్తిగా పేరు సంపాదించుకుందని తెలిపారు. ప్రపంచ వాణిజ్యం, ఇంధన ప్రవాహాలకు సముద్ర మార్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, భౌగోళిక-రాజకీయ పరిస్థితి, నిరంతర సవాళ్లతో కూడిన భద్రతా వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని నావికాదళం బలంగా, అత్యాధునిక పరికరాలతో సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో, క్యారియర్ బాటిల్ గ్రూప్‌తో సహ 36 భారతీయ నావికాదళ నౌకలను పలు ప్రాంతాల్లో మోహరించినట్లు చెప్పారు. తూర్పు నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ మాట్లాడుతూ.. పదహారు యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ తరగతి నౌకలలో మొదటిది భారత నావికాదళంలోకి అధికారికంగా ప్రవేశించిందని తెలిపారు. కోల్‌కతాలోని మెస్సర్స్ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్, ఇంజనీర్స్ ద్వారా, మెస్సర్స్ ఎల్‌అండ్‌టి షిప్ బిల్డర్స్‌తో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) కింద నిర్మించబడిన ఈ నౌకను మే 8న భారత నావికాదళానికి అప్పగించారని తెలిపారు. ఈ యుద్ధనౌక 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ కంటెంట్‌ను కలిగి ఉందన్నారు. ఇది తీరప్రాంత రక్షణను బలోపేతం చేస్తుందని తెలిపారు. కీలకమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర శక్తిగా భారతదేశం స్థానాన్ని ఇది నిలబెడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ చైర్మన్ పిఆర్.హరి, వైస్ అడ్మిరల్స్ ఆర్.స్వామినాధన్, సమీర్ సక్సేన, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నౌక ప్రత్యేకతలు

సబ్‌సర్ఫేస్ సర్వైలెన్స్, సెర్చ్, రెస్క్యూ మిషన్‌లు, తక్కువ ఇంటెన్సిటీ మారిటైమ్ ఆపరేషన్‌లను నిర్వహించడానికి ఈ నౌకను నిర్మించారు. 1490 టన్నులకు పైగా బరువు కలిగి, 77.6 మీటర్ల పొడవైన యుద్ధనౌక. డీజిల్ ఇంజిన్-వాటర్‌జెట్ కలయిక ద్వారా నడపబడే తొలి అతిపెద్ద భారతీయ నావికా యుద్ధనౌక ఇదే.

చెట్టును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

- ముగ్గురు యువకుల మృతి

ప్రజాశక్తి-బొండపల్లి (విజయనగరం జిల్లా)

ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొండపల్లిలో బంగారమ్మ తల్లి - నగలపోలమ్మ తల్లి సంబరాలు జరుగుతున్నాయి. బొండపల్లి గ్రామానికి చెందిన పురం సతీష్ (22), నెల్లి రమణ (22), దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన గుత్తల దినేష్ (20) వేడుకలను చూసేందుకు వచ్చారు. అనంతరం ద్విచక్ర వాహనంపై బొండపల్లి నుంచి చామలవలస సమీపంలో బావి వద్ద స్నానం చేసేందుకు బయలుదేరారు. మార్గ మధ్యలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో రమణ, దినేష్ అక్కడికక్కడే మృతి చెందగా, సతీష్‌ను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

విశాఖ విమల విద్యాలయాన్ని పునః ప్రారంభించాలి

- పాఠశాల ఎదుట విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విద్యా సంవత్సరం ప్రారంభమై పది రోజులు అవుతున్నా నేటికీ విశాఖ స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఉన్న విశాఖ విమల విద్యాలయం పాఠశాలను ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ జివిఎంసి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆధ్వర్యాన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ.. పాఠశాలను ప్రారంభించకపోవడంతో రెండు వేల మంది విద్యార్థుల భవిష్యత్తు రోడ్డు మీద పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలచే పాఠశాలను పునఃప్రారంభించేలా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విశాఖ విమల విద్యాలయానికి ఇవ్వాల్సిన ఫైనాన్షియల్ ఎయిడ్ ఇవ్వకుండా నిలుపుదల చేయడంతో ఈ సమస్య తలెత్తిందని, గత రెండు నెలలుగా ఈ సమస్య కొనసాగుతున్నా స్థానిక టిడిపి, బిజెపి, ఎంపీలు, ఎమ్మెల్యేలు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లో పని చేసే కాంట్రాక్టు కార్మికుల పిల్లలు, స్టీల్ నిర్వాసిత కుటుంబాల పిల్లలు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారన్నారు. స్కూల్‌ను పునఃప్రారంభించకపోతే గురువారం పాఠశాలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.

కొల్లేరులో మానవ హక్కుల ఉల్లంఘన

- కేంద్ర సాధికారిక కమిటీ ఎదుట వాపోయిన ప్రజలు
- వేలాది మంది ఏలూరు తరలొచ్చి వినతుల అందజేత
- 1996లో కొల్లేరుపై జరిగిన అభిప్రాయ సేకరణ అంతా మోసమని వెల్లడి

కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో వినతులు స్వీకరిస్తున్న కమిటీసభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో రోడ్లు సైతం వేసే పరిస్థితి లేకుండా పోవడంతో అభివృద్ధి జరగడం లేదని, జిరాయితీ, డి.ఫారం పట్టా భూముల్లో చెరువులన్నింటినీ ధ్వంసం చేయడంతో ఉపాధి లేక భూములున్నా నిరుపేదల్లా బతుకుతున్నామని కొల్లేరు ప్రజలు కేంద్ర సాధికారిక కమిటీకి విన్నవించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా చంద్రప్రకాష్ గోయల్, డాక్టర్ జెఆర్.భట్, జి.భానుమతి, సునీల్ లిమాయేతో కూడిన కేంద్ర సాధికారిక బృందం మంగళవారం జిల్లాకు విచ్చేసింది. తొలిరోజు కొల్లేరు గ్రామాల్లో పర్యటించగా, రెండోరోజు బుధవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కొల్లేరు ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. అనంతరం సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకుంది. ఉంగుటూరు, దెందులూరు, ఉండి, కైకలూరు నియోజకవర్గాల్లోని కొల్లేరు ప్రజలంతా కమిటీకి తమ గోడు చెప్పుకునేందుకు వేలాది మంది ఏలూరుకు తరలొచ్చారు. జనం నుంచి వినతులు స్వీకరించిన అనంతరం పలువురు కొల్లేరు ప్రాంత నాయకులు మాట్లాడారు. కొల్లేరు నాయకులు నంబూరి వెంకటరామరాజు, శివాజీ, సైదు సత్యనారాయణ మాట్లాడుతూ... సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం, ఫిషింగ్ చేయమనడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

పర్యావరణాన్ని, పక్షులను కాపాడుతున్నది రైతులే అన్నారు. పంటలకు ఉపయోగపడే కాలువలు బాగు చేయడం లేదని, వాటిని ఇరిగేషన్‌కు అప్పగించాలని కోరారు. కమిటీ నివేదికతో తమ జీవనం అధాపడి ఉందని తెలిపారు. కొల్లేరులో మానవ హక్కులు దెబ్బతింటున్నాయన్నారు. 122 గ్రామాల్లో మూడు లక్షల మంది జనాభా ఉన్నారని, అధిక శాతం ఎస్‌సి, బిసి తరగతుల ప్రజలేనని తెలిపారు. జిరాయితీ, సొసైటీ భూములను పూర్తిగా ధ్వంసం చేయడంతో ఉపాధి లేకుండా పోయిందన్నారు. చిత్తడి నేలల నిర్ధారణలోనూ లోపం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జోక్యం చేసుకుంటూ 1996లో ఐదో కాంటూరు సరిహద్దులు నిర్ధారణ సందర్భంగా జరిగిన గ్రామసభల్లో అంతా అంగీకరించినట్లు ఉంది కదా అని అడగ్గా.. అప్పట్లో తమకు చదువులు లేవని ఒకరిద్దరితో అధికారులు మాట్లాడి మోసపూరిత నివేదికలు అందించారన్నారు. తమకు తెలియకుండా జరిగిందని వినతిరూపంలో సమర్పించాలని కమిటీ సభ్యులు సూచించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. కొల్లేరు ప్రజలను అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, టూరిజం అభివృద్ధి సైతం జరగకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇరిగేషన్, పొల్యూషన్, ఏలూరు కార్పొరేషన్, అటవీశాఖ అధికారులతో సాధికారిక కమిటీ ప్రత్యేకంగా సమావేశమై వివరాలు తీసుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, కలెక్టర్ వెట్రిసెల్వి, డిఆర్ఒ విశ్వేశ్వరరావు, అటవీశాఖ అధికారి విజయ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వాస్తవమే

- పిసిసి అధ్యక్షులు షర్మిల

విశాఖ ఎయిర్‌పోర్టులో విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

ప్రజాశక్తి-గోపాలపట్నం (విశాఖపట్నం)

తన రాజకీయ భవిష్యత్తును నాశనం చేయటానికే ఫోన్ ట్యాపింగ్ చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆరోపించారు. విశాఖ విమానాశ్రయంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న విషయం ముమ్మాటికి నిజమని తెలిపారు. 2018-2019లో తెలంగాణలో కెసిఆర్, ఆంధ్రలో జగన్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు వీరి మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగాయని, వారి సంబంధం ముందు రక్త సంబంధం చిన్నబోయిందని పేర్కొన్నారు. తెలంగాణలో తాను కెసిఆర్‌తో పోరాటం చేస్తున్నప్పుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేకపోయినా తనపై కక్షకట్టారని, తనను రాజకీయంగా తొక్కేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. స్వయంగా వైవి సుబ్బారెడ్డే హైదరాబాద్‌లో తమ ఇంటికి వచ్చి ఫోన్ ట్యాప్ అవుతున్న విషయాన్ని తెలియజేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన సంభాషణలు తనకు స్వయంగా వినిపించారని తెలిపారు. అప్పుడు ఫోన్ ట్యాపింగ్‌పై పోరాటం చేయటానికి వీలుపడలేదని, ప్రస్తుతం ప్రభుత్వాలు మారాయని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. విచారణకు ఎక్కడకు రమ్మంటే అక్కడికి వచ్చి అధికారులకు సహకరిస్తానని తెలిపారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని పున్నమి రిసార్ట్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో వైఎస్.షర్మిల సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై బిజెపితో కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు.

కొల్లేరులో కేజీ కల్చర్‌తో ముంపు నివారణ

- రైతు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొల్లేరులో కేజీ కల్చర్ విధానం చేపల సాగు చేపడితే వరద నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు నేతృత్వంలో రైతు సంఘాల నాయకులు కొల్లేరు పరిశీలన బృందాన్ని కోరారు. విజయవాడలోని ఓ హోటల్‌లో కొల్లేరు పరిశీలన బృందాన్ని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కొల్లేరు పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. ముఖ్యంగా కేజీ కల్చర్ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపల చెరువుల యజమానులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫలితంగా ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు కొల్లేరుకు చేరడం, అక్కడి నుంచి ఉప్పుటేరు నుంచి సముద్రంలో కలిసేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. కొల్లేరు నుంచి సముద్రంలోకి వెళ్లాల్సిన వరదనీటి ప్రవాహ మార్గంలో పెద్ద కట్టలతో చెరువులు నిర్మించడం వల్ల వరద నీరు సముద్రంలోకి వెళ్లే మార్గం లేక ఏటా లక్ష నుంచి 2 లక్షల ఎకరాలు పంట పొలాలు ముంపునకు గురై పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొందన్నారు. బృందాన్ని కలిసిన వారిలో రైతు సంఘాల నాయకులు వై కేశవరావు, పి జమలయ్య, కొల్లా రాజమోహన్, మరీదు ప్రసాద్, కె కోటయ్య తదితరులు ఉన్నారు.

ఆభరణాల ఎగుమతుల్లో 16 శాతం పతనం

న్యూఢిల్లీ : ఈ ఏడాది మేలో భారత రత్నాలు, అభరణాల ఎగుమతుల్లో 15.81 శాతం పతనం చోటు చేసుకుందని జెమ్స్ అండ్ జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జిజెఇపిసి) వెల్లడించింది. గత నెలలో ఈ రంగం ఎగుమతులు రూ.19,260.81 కోట్లకు తగ్గాయి. 2024 ఇదే నెలలో రూ.22,414.02 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు రూ.16,184 కోట్లుగా ఉండగా.. గడిచిన మేలో 12.96 శాతం తగ్గుదలతో రూ.14,393 కోట్లుగా చోటు చేసుకున్నాయి. అమెరికా హెచ్చు టారిఫ్‌లకు తోడు గ్లోబల్ అనిశ్చితితో ఎగుమతులో తగ్గుదల చోటు చేసుకుందని జిజెఇపిసి వర్గాలు పేర్కొన్నారు. ఈ ఏడాది మేలో మొత్తం భారత సరుకుల ఎగుమతులు 2.17 శాతం పతనమై 38.73 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో 39.59 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన మేలో దేశ దిగుమతులు 1.7 శాతం తగ్గి 60.61 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఎగుమతులు తక్కువగా ఉండి.. దిగుమతులు ఎక్కువగా ఉండటంతో వాణిజ్యలోటు 21.88 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ప్రస్తుత ఇరాన్-ఇజ్రాయిల్ ఉద్రిక్తతలు భారత ఎగుమతులపై మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గడిచిన మే నెలలో బియ్యం, ముడి ఇనుప ఖనిజం, రత్నాలు, అభరణాలు, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రతికూల వృద్ధి చోటు చేసుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు ఏకంగా 30.32 శాతం క్షీణించి 5.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో స్థూల భారత ఎగుమతులు స్వల్పంగా 0.08 శాతం పెరిగి 437.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మరోవైపు దిగుమతులు 6.62 శాతం పెరిగి రూ.720.24 బిలియన్ డాలర్లకు ఎగిశాయి.

నిప్పాన్ కోయి ఇండియా ఎమ్‌డిగా సంపత్ కుమార్

హైదరాబాద్ : జపాన్‌కు చెందిన ఐడిఅండ్ఇ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ నిప్పాన్ కోయి ఇండియా (ఎన్‌కెఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా జి సంపత్ కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ తొలిసారి భారతీయుడికి బాధ్యలను అప్పగించింది. సంపత్ కుమార్ నియామకం జూన్ 17 నుంచి అమల్లోకి వచ్చింది. ఇంతక్రితం ఆయన బిడి అండ్ మార్కెటింగ్‌కు సిఎండిగా ఉన్నారు. కాగా.. ఇప్పటి వరకు ఎన్‌కెఐకి ఎండిగా వ్యవహరించిన కట్సుస పకసకు వైదొలిగారు. ఇది భారత మార్కెట్ పట్ల తమ నిబద్ధతను, నాయకత్వ ప్రతిభ గుర్తింపునకు నిదర్శమనం ఆ సంస్థ పేర్కొంది. ఎన్‌కెఐ భారత్‌లో రవాణా, పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణతో సహా వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కలిగి ఉంది.

మార్కెట్లలో యుద్ధ కలవరం

- సెన్సెక్స్ 139 పాయింట్ల తగ్గుదల



ముంబయి : పశ్చిమాసియాలోని ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధం దలాల్ స్ట్రీట్‌ను రెండో రోజూ కలవరానికి గురి చేసింది. బుధవారం ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 138.64 పాయింట్లు లేదా 0.17 శాతం పతనమై 81,445కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 41 పాయింట్ల నష్టంతో 24,812 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.46 శాతం, 0.23 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. సెన్సెక్స్ 30 సూచీలో టిసిఎస్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు అధిక నష్టాలను చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ లాభపడ్డాయి.

స్మాల్ క్యాప్ స్టాక్స్ ఐదు రెట్ల వృద్ధి : బజాజ్ ఫిన్‌సర్వ్

గడిచిన ఏడేళ్లలో స్మాల్ క్యాప్ స్టాక్స్ ఐదు రెట్ల వృద్ధిని నమోదు చేశాయని బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి పేర్కొంది. 2017 నుంచి 2024 మధ్య ప్రతీ ఏడాది సగటున 27.6 శాతం చొప్పున రాబడిని అందించాయని పేర్కొంది. 2017లో మార్కెట్ కాపిటలజైషన్ రూ.17 లక్షల కోట్లుగా ఉండగా.. 2024 ముగింపు నాటికి రూ.92 లక్షల కోట్లకు చేరిందని బజాజ్ ఫిన్ సర్వ్ వెల్లడించింది.

వృద్ధి 6.5 శాతమే : ఇక్రా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ ఇక్రా అంచనా వేసింది. గ్రామీణ డిమాండ్, అదాయపు పన్ను తగ్గింపు, తక్కువ వ్యయాలు తగ్గడంతో ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభించొచ్చని తెలిపింది. ఈ ఏడాది వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 4.2 శాతం, టోకు ద్రవ్యోల్బణం సూచీ 2.7 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. జిడిపిలో విత్త లోటు 4.4 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది.

ఒబెన్ ఎలక్ట్రిక్‌కు మరో రూ.50 కోట్ల నిధులు

బెంగళూరు : ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను ఉత్పత్తి చేసే స్టార్టప్ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ మరో రూ.50 కోట్ల నిధులను సమీకరించినట్లు ప్రకటించింది. సిరీస్ ఎ రౌండ్‌లో ఈ పెట్టుబడిని అందుకున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం జనవరిలో రూ.50 కోట్ల నిధులకు ఇది అదనమని పేర్కొంది. దీంతో సిరీస్ ఎ ఫండింగ్‌లో రూ.100 కోట్లు అందుకోగా.. ఇప్పటి వరకు మొత్తంగా రూ.200 నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. తాజాగా నిధులు అందించిన వాటిలో హెలియోస్ హోల్డింగ్స్, షర్దా ఫ్యామిలీ ఆఫీసు, కె ఫ్యామిలీ, ఇతర ఇన్వెస్టర్లు ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం ఈ సంస్థకు 27 నగరాల్లో 37 అవుట్‌లెట్‌లు ఉన్నాయి. 2026 మార్చి నాటికి దేశంలో 50 నగరాల్లో 150 షోరూంలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వి-గార్డ్ నుంచి లక్జిక్యూబ్ వాటర్ హీటర్ సిరీస్ ఆవిష్కరణ

కొచ్చి : ఎలక్ట్రికల్స్ బ్రాండ్ వి-గార్డ్ కొత్తగా ప్రీమియం లక్జిక్యూబ్ వాటర్ హీటర్ సిరీస్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇది లగ్జరీ, స్మార్ట్ లివింగ్ స్థాయిని పెంపొందిస్తుందని ఆ సంస్థ పేర్కొంది.. అత్యాధునిక సాంకేతికత, ఆకర్షణీయ డిజైన్‌తో మిళితం చేస్తూ అందుబాటులోకి తెచ్చామని వి -గార్డ్ ఇండస్ట్రీస్ ఎండి మిథున్ చిట్టిలపిల్లి పేర్కొన్నారు. దీర్ఘకాలిక మన్నికతోపాటు పనితీరు కోసం నికెల్ సుసంపన్నమైన ఇంకోలాయ్ 800 హీటింగ్ ఎలిమెంట్‌ను ఇందులో ఉపయోగించామన్నారు.

సంపాదకీయం

కౌలు రైతుకు రక్షణేది?

అప్పులు తెచ్చి, నానా అవస్థలూ పడి, ఆరుగాలం కష్టించి పనిచేసే అన్నదాతలు వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలకు పాల్పడాల్సి రావడం అత్యంత విచారకరం, ఆధునిక సమాజానికి మాయని మచ్చ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఎప్పటికప్పుడు తాము రైతు పక్షపాతులమంటూ కబుర్లు వల్లిస్తూనే ఉంటాయి. కానీ, ఆచరణలో జరుగుతున్నదేమిటి? తమ రెక్కలను తామే నమ్ముకొని సాగు దారిలో సాగుతున్న రైతులకు ఒరుగుతున్నదేమిటి? వారిని ఏటేటా కష్టాలూ కన్నీళ్లూ వరదల్లా ముంచెత్తుతున్నాయి తప్ప అవసరమైన స్థాయిలో భరోసా, సహాయమూ ప్రభుత్వాల నుంచి అందటం లేదు. సగానికి పైగా భూములను సాగు చేస్తూ, వ్యవసాయోత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సాగుకు పెట్టుబడి సాయం దొరక్క, విత్తనాలు ఎరువులూ అందుబాట్లో లేక, పండించిన పంటకు తగిన ధర లభించక కౌలుదారులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒక పంట కాకపోతే మరొక పంటలోనైనా కాస్త ఆదాయం కళ్ళజూడొచ్చని ఆశించే రైతులకు ప్రభుత్వాల నుంచి, ప్రకృతి వైపరీత్యాల నుంచీ ఎడాపెడా దెబ్బలు తప్పటం లేదు. ఇలా పదే పదే నష్టాలను చవిచూసే రైతుల్లో కొంతమంది ధైర్యాన్ని కోల్పోయి, ప్రాణాలను తీసుకోవటం తీవ్రంగా బాధించే విషయం. మిర్చి, పొగాకు పంటలు వేసి, నష్టాల్లో కూరుకుపోయిన ముగ్గురు పల్నాడు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డం చాలా విషాదకరం.

సమాజంలో వచ్చిన అనేక మార్పుల వల్ల నేడు వ్యవసాయంలో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా ఉంది. రాష్ట్రంలో 25 లక్షల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారని ఒక అంచనా. ఈ సంఖ్య క్రమేణా పెరుగుతోంది కూడా. భూమి సొంతంగా ఉన్న రైతులే వ్యవసాయ నష్టాలను తట్టుకోవటం కష్టం. ఎలాంటి రుణ పరపతీ లేని, ప్రభుత్వ సహాయం అందని కౌలుదారులు ఎకరాకు 10 వేల నుంచి 20 వేలు వరకూ కౌలు చెల్లిస్తూ .. సేద్యంలో ఈదుకురావటం మరింత కష్టంగా పరిణమిస్తోంది. అతివృష్టో, అనావృష్టో ముంచుకురావడం మొదలుకొని, అకస్మాత్తుగా ధరలు పడిపోవటం వరకూ కష్టాలు కాలనాగుల్లా వెంటాడుతూ ఉన్నాయి. కష్టకాలంలో కౌలు రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఏర్పాట్లూ లేకపోవటం ఒక దారుణం. నాలుగు దశాబ్దాల క్రితం కూడా కౌలు వ్యవసాయం ఉన్నా అది చాలా పరిమితం. రెండు మూడు దశాబ్దాల నుంచి కౌలుదారుల సంఖ్య గణనీయంగా పెరిగినా వారికి ప్రభుత్వాల నుంచి గుర్తింపు లేదు. రైతుసంఘాల పోరాటాలూ, మేధావుల సూచనల మేరకు చట్టాలు తెచ్చే ప్రయత్నం చేసినా అవి లోపభూయిష్టంగా ఉన్నాయి. ప్రభుత్వం తలచుకుంటే సాగులో ఉన్న రైతులు ఎవరనేది తెలుసుకోవటం ఏమాత్రమూ కష్టం కాదు. భూయజమానుల నుంచి రాతపూర్వక అనుమతి తెచ్చుకోవాలనే నిబంధన వల్ల కౌలుదారులకు గుర్తింపు కార్డులు దొరకటం దగ్గరే మొదటి గండి పడుతోంది. గ్రామ సభలో కౌలుదారులను గుర్తించే ప్రక్రియని కేరళ వామపక్ష ప్రభుత్వం పకడ్బందీగా చేస్తోంది. ఈ విషయాన్ని సామాజిక, ఆర్థిక సర్వే 2024-25 స్పష్టంగా పేర్కొని, ప్రశంసించింది. గతంలో పశ్చిమ బెంగాల్‌లోనూ వామపక్ష ప్రభుత్వం కౌలు రైతుల గుర్తింపునకు మేలైన విధానాలను అమలు చేసింది. రాతపూర్వకమైన ఒప్పందం అంటే అది తాము భూహక్కును కోల్పోయే వ్యవహారంగా భూయజమానులు భావిస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభల ద్వారా సులభమైన గుర్తింపు విధానాన్ని అవలంబించాలి.

గుర్తింపు లేని కారణంగా కౌలు రైతులకు ప్రభుత్వాలు అందించే అరకొర సహాయం కూడా అందకుండాపోతోంది. పంట రుణాలు, భరోసా పథకాలు, నష్ట పరిహారాలూ కౌలు రైతులకు దూరమవుతున్నాయి. దీనికి తోడు వ్యవసాయోత్పత్తుల కొనుగోలును పూర్తిగా మార్కెట్టు శక్తులకే పాలకులు వదిలేయటం ఎక్కువ సమస్యలకు దారి తీస్తోంది. ఈ ఏడాది మిర్చి, పొగాకు పంటల విషయంలో ఇదే జరిగింది. వ్యవసాయోత్పత్తులు మార్కెట్టుకు వచ్చినప్పుడు వ్యాపారులు ఇష్టారీతిన ధరలు నిర్ణయించి, రైతుల ఉసురు తీసుకుంటున్నారు. కౌలు రైతుల చట్టాన్ని ప్రయోజనకరంగా రూపొందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టాలి. ప్రతి ఒక్క కౌలు రైతుకూ గుర్తింపునిచ్చి పంటరుణాలు, ఆర్థిక సహాయమూ అందించాలి. 'అన్నదాతా, సుఖీభవ' ద్వారా పెట్టుబడి సాయం అందించటం దగ్గర నుంచే ఆ తోడ్పాటును ఆరంభించాలి.

మహనీయుల మాట



పోరాటం మాత్రమే పీడిత వర్గాన్ని ఎడ్యుకేట్ చేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తి ఏమిటో దానికి తెలియచేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తిని విస్తృతపరుస్తుంది. సామర్థ్యాన్ని పెంచుతుంది. స్పష్టతనిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.
- వి.ఐ.లెనిన్

విశ్లేషణ

విశ్వవిద్యాలయాలపై దాడులు

ట్రంప్ అధికార యంత్రాంగం హార్వర్డ్ యూనివర్శిటీకి ఏటా ఇచ్చే 3.2 బిలియన్ డాలర్ల విలువ చేసే గ్రాంట్లు, కాంట్రాక్టులను స్తంభింపచేసింది. అలాగే కొన్ని దశాబ్దాలుగా ఆ విశ్వవిద్యాలయానికి ఇస్తూ వచ్చిన పన్ను మినహాయింపులను ఉపసంహరించింది. తద్వారా హార్వర్డ్ విశ్వవిద్యాలయం మరికొన్ని మిలియన్ డ్లాలర్లను ప్రభుత్వానికి ఎదురు చెల్లించాల్సి వస్తుంది. 'రాజకీయంగా భిన్నాభిప్రాయాలకు నెలవుగా ఉండడమే విశ్వవిద్యాలయాల ఉనికికి ముప్పు తెచ్చిపెడుతుంది' అని హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షులు అలన్ ఎం.గార్బర్ వివరించారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించడం దగ్గర నుండి ప్రాంగణాల్లో వివిధ రాజకీయ అంశాలపై జరిగే విద్యార్థి నిరసన ప్రదర్శనలు, ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్, డి.ఇ.ఐ (వైవిధ్యం, సమానత్వం, సమ్మిళితం) పాలసీ అమలు చేయడం వరకు ప్రస్తుతం అనుసరిస్తున్న విధివిధానాలను తమ ఆదేశాల మేరకు సవరించాలని ట్రంప్ అధికార యంత్రాంగం విశ్వవిద్యాలయాల మీద ఒత్తిడి తీసుకు వస్తున్నది.

విశ్వవిద్యాలయాలు మునుపెన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. భారతదేశంలోని విశ్వవిద్యాలయాలు గత మూడు దశాబ్దాలుగా ఒకదాని తర్వాత ఒకటిగా, ఒకదానిని మించిన స్థాయిలో మరొకటిగా సవాళ్లను ఎదుర్కొంటూ వస్తున్నాయి. అమెరికాలో 2025 జనవరిలో ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన నాటి నుంచి ఈ సవాళ్లు తలెత్తడం మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో విశ్వవిద్యాలయాలు తీవ్ర సవాళ్లను చవిచూస్తున్నాయి. విశ్వవిద్యాయాల నుండి సమాజం ఏం ఆశించాలి అన్న దృక్పథంలో వస్తున్న మార్పులే ఈ సవాళ్లకు దారితీశాయి.

ట్రంప్ అధికార యంత్రాంగం హార్వర్డ్ యూనివర్శిటీకి ఏటా ఇచ్చే 3.2 బిలియన్ డాలర్ల విలువ చేసే గ్రాంట్లు, కాంట్రాక్టులు స్తంభింపచేసింది. అలాగే కొన్ని దశాబ్దాలుగా ఆ విశ్వవిద్యాలయానికి ఇస్తూ వచ్చిన పన్ను మినహాయింపులను ఉపసంహరించింది. తద్వారా హార్వర్డ్ విశ్వవిద్యాలయం మరికొన్ని మిలియన్ డ్లాలర్లను ప్రభుత్వానికి ఎదురు చెల్లించాల్సి వస్తుంది. 'రాజకీయంగా భిన్నాభిప్రాయాలకు నెలవుగా ఉండడమే విశ్వవిద్యాలయాల ఉనికికి ముప్పు తెచ్చిపెడుతుంది' అని హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షులు అలన్ ఎం.గార్బర్ వివరించారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించడం దగ్గర నుండి ప్రాంగణాల్లో వివిధ రాజకీయ అంశాలపై జరిగే విద్యార్థి నిరసన ప్రదర్శనలు, ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్, డి.ఇ.ఐ (వైవిధ్యం, సమానత్వం, సమ్మిళితం) పాలసీ అమలు చేయడం వరకు ప్రస్తుతం అనుసరిస్తున్న విధివిధానాలను తమ ఆదేశాల మేరకు సవరించాలని ట్రంప్ అధికార యంత్రాంగం విశ్వవిద్యాలయాల మీద ఒత్తిడి తీసుకు వస్తున్నది. హార్వర్డ్ యూనివర్శిటీతో మొదలై కొలంబియా తదితర విశ్వవిద్యాలయాల మీద ట్రంప్ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్నది.



ప్రొ॥ అరుణ్ కుమార్

ఇక మన దేశం విషయానికి వస్తే ఉన్నత విద్యపై విశ్వవిద్యాలయాల నియంత్రణ క్రమంగా విద్యావేత్తల చేతుల్లోంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్‌ల చేతుల్లోకి జారిపోయింది. బోధన, పరిశోధనా రంగాల్లో సవాళ్లు నానాటికీ పెరుగుతూ వస్తున్నాయి. విశ్వవిద్యాలయాలు ప్రొఫెసర్లకు బాసటగా నిలబడటంలో విఫలమవుతున్నాయి. ప్రతిష్టాత్మక అశోకా ప్రైవేటు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అరెస్టు సందర్భంగా ఆ ఉదంతంతో తమకు ప్రమేయం లేదని యాజమాన్యం చేతులు దులిపేసుకోవడం ఇందుకు తాజా ఉదాహరణ. విశ్వవిద్యాలయాలు సామాజికంగా నిర్వర్తించాల్సిన పాత్ర విషయంలో మారుతున్న ప్రభుత్వ దృక్పథాలు, ప్రాధాన్యతలే ఇలాంటి విపరీతాలకు దారి తీస్తున్నాయి.

స్వాభావిక ఉద్రిక్తతలు

సమాజంలో విశ్వవిద్యాలయాలు పోషించాల్సిన పాత్ర విషయంతో స్వాభావికమైన ఉద్రిక్తతలు నెలకొని ఉంటాయి. విశ్వవిద్యాలయాలు ఒకవైపు సమాజంలో ఎదురవుతున్న సవాళ్ల పరిష్కారానికి తగిన జ్ఞానాన్ని ఉత్పత్తి చెయ్యాలి.

సృజనాత్మక పాత్రకు పూర్తి న్యాయం చెయ్యాలంటే విద్యా వ్యవస్థకు స్వయంప్రతిపత్తి ఉండాలి. సృజనాత్మక ఆలోచనలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయి. వాస్తవం ఏంటంటే పాలక వర్గాలు సదా సృజనాత్మక అవసరం గురించి జపిస్తూ ఆచరణలో సృజనాత్మకతను డొల్ల చేసేస్తున్నాయి. విద్యా రంగానికి స్వయంప్రతిపత్తి కల్పించడం ద్వారా సమాజంలో ఎదురవుతున్న సవాళ్ళకు, సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలను అన్వేషించడం సాధ్యపడుతుంది. సమాజంలో మార్పులు ఎంత వేగంగా చోటు చేసుకుంటున్నాయంటే పలానా మార్పు వచ్చిందని గుర్తించేలోగా దాన్ని పరిష్కరించడానికి సమయం మించిపోతోంది.

విద్యా రంగానికి స్వయం ప్రతిపత్తి కల్పించడం అంటే సమాజంలో నెలకొన్న సంప్రదాయ భావజాలాన్ని సవాలు చేసే నవీన జ్ఞానాన్ని సముపార్జించడానికి అవకాశం కల్పించడమే. విశ్వవిద్యాలయాల్లో సర్వసాధారణంగా నెలకొని ఉండే స్వేచ్ఛాపూరిత వాతావరణం మహలనోబిస్‌ను ఒక మేధావిగా మలిచింది. సూటిగా చెప్పుకోవాలంటే విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న స్వేచ్ఛాపూరిత వాతావరణం సమాజానికి నూతన అన్వేషణలను అందించే జ్ఞాన గనులను సృష్టిస్తుంది.

అందుకే విశ్వవిద్యాలయాలకు సంపూర్ణ స్వయంప్రతివత్తి వుండాలి. స్వార్ధ ప్రయోజనాలకు అతీతంగా, నూతన విజ్ఞాన కల్పనకు పరిపూర్ణ అవకాశాలు కల్పించేలా విశ్వవిద్యాలయాల్లో పై నుండి కింది స్థాయి వరకూ అలాంటి స్వయంప్రతిపత్తి కల్పించాలి.

అపుడే బోధకులు తమ తమ రంగాలలో మరిన్ని బోధనా మెళకువలు, మెరుగైన పరిశోధనలకుగల మార్గాలను అన్వేషించగలుగుతారు. తద్వారా సంప్రదాయ నియంత్రణలను అధిగమించి మరింత వాస్తవిక పరిజ్ఞానాన్ని పెంపొందించగలుగుతారు. సంప్రదాయ ఆలోచనలను, భావజాలాన్ని ప్రశ్నించే స్వభావం విద్యా వ్యవస్థలో అంతర్భాగంగా సాగాలి. దీనిమూలంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చోటు చేసుకోవచ్చునేమోకానీ తీసుకునే నిర్ణయాలు మాత్రం పటుత్వంతో కూడి వుంటాయి. విశ్వవిద్యాలయాలను నడిపించే అధికార యంత్రాంగానికి ఈ స్పృహ వుండాలి. సంస్థను ప్రజాస్వామికంగా నడిపించడానికి సిద్ధపడాలి. అసమ్మతిని, భిన్నాభిప్రాయాలను సహజ స్వభావంగా గుర్తించాలే తప్ప దుర్బుద్ధి పేరిట అణిచివేతకు పాల్పడకూడదు. అందుకే బ్యూరోక్రాట్లు కానీ బ్యూరోక్రాట్లుగా వ్యవహరించే విద్యావేత్తలు కానీ విశ్వవిద్యాలయాలను నిర్వహించేందుకు ఎంతమాత్రం అర్హులు కారని మనం అర్థం చేసుకోవచ్చు.

సంప్రదాయ భావజాలాన్ని సవాలు చేసే స్వభావం విశ్వవిద్యాలయాల సహజగుణంగా ఉంటుంది. యూనివర్సిటీలు ఎలా నడవాలి అన్న పాలక వర్గాల ఆలోచనలకు, విశ్వవిద్యాలయాల్లో నెలకొని ఉండే సహజ స్వభావానికి మధ్యన ఉద్రికత్తతలు నెలకొనడం సర్వసాధారణ పరిణామమే. విశ్వవిద్యాయాల కులపతులు ఈ ఉద్రిక్తతలను సంభాళించగల సంభాషణా చతురత కలిగి ఉండాలి. బ్యూరోక్రటిక్ ఆలోచనలతో ఈ సమస్యను ఎంత మాత్రం పరిష్కరించలేరు.

భిన్నాభిప్రాయాలను, అసమ్మతిని అనుమతించడం మూలంగా విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ వ్యతిరేక ధోరణులు, భావజాలాలు నెలకొంటాయి. కానీ, విశ్వవిద్యాలయాలు సమాజంలో యథాతథ స్థితిని కొనసాగించేందుకు సాధనాలుగా ఉండాలని పాలక వర్గాలు కోరుకుంటాయి. ఫ్యూడల్ సమాజంలో ప్రజలు తమను ప్రశ్నించకుండా ఉండడం పాలక వర్గాలకు సంక్రమించే జన్మ హక్కుగా భావిస్తుంటాయి. పెట్టుబడిదారీ సమాజం కూడా చైతన్యవంతమైన కార్మిక వర్గానికి బదులు చైతన్య రహితంగా, అణిగిమణిగి పనిచేసే కార్మిక వర్గాన్నే కోరుకుటుంది. మన ఆధునిక సమాజంలో పాలకవర్గాలు ఈ రెండు లక్షణాలనూ పుణికిపుచ్చుకున్నాయి. అందుకే విశ్వవిద్యాలయాల, విద్యా వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని కాలరాయాలని చూస్తుంటాయి.

స్వయం ప్రతపత్తి అడ్డంకా?

పాలక శక్తుల హ్రస్వ దృష్టి, విశ్వాస రాహిత్యాల మూలంగా ప్రభుత్వ వ్యతిరేక లక్షణాలను నేరంగా, శాపంగా పరిగణిస్తుంటాయి. అందుకే స్వయం ప్రతిపత్తిని కూడా తమ ఎజెండాను ముందుకు నడిపించడానికే వాడుకోవాలని చూస్తుంటాయి. నూతన ఆలోచనలతో పని లేదు. వాటికి విలువ ఇవ్వవు. అందుకే విశ్వవిద్యాలయాల స్థాయిని, వాటి సామాజిక బాధ్యతను కుదించడానికే చూస్తుంటాయి. ఇలాంటి దుర్భర నేపథ్యంలో విద్యావేత్తలు కూడా యథాతథస్థితి వాదులుగా మారిపోతుంటారు.

అమెరికా, చైనా దేశాలు రెండూ దీర్ఘకాలిక ఎజెండాలను అనుసరించడం ద్వారా శీఘ్రగతిన ప్రపంచీకరణకు లోనవుతున్న ప్రపంచ దేశాల్లోనే సాంకేతికాభివృద్ధిలో అగ్రగామి దేశాలుగా నిలిచాయి. ఇందుకుగాను అమెరికా స్వయం ప్రతిపత్తిగల అనేక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలను, పరిశోధనా సంస్థల వ్యవస్థను నెలకొల్పి ప్రపంచ వ్యాప్తంగా మేధస్సును ఆకర్షించింది. ప్రస్తుతం ట్రంప్ హయాంలో విశ్వవిద్యాయాల, పరిశోధనా సంస్థల స్వయం ప్రతిపత్తి మీద దాడులు మొదలయ్యాయి.

నిధులు-స్వయంప్రతిపత్తి

ట్రంప్ అధికార యంత్రాంగం ఒత్తిడికి కొలంబియా విశ్వవిద్యాలయం లొంగిపోయింది. కానీ హార్వర్డ్ విశ్వవిద్యాలయం ట్రంప్ యంత్రాంగం ఆదేశాలను తిరస్కరించడమే కాకుండా, ఈ ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకం అని ప్రకటించాలని కోరుతూ కోర్టులో కేసు వేసింది. అమెరికాలోని 150 విశ్వవిద్యాలయాలు హార్వర్డ్ నిర్ణయానికి మద్దతు పలికాయి. అయితే ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు భారీ విరాళ నిధులు ఉండగా ప్రభుత్వం నిధులు ఎందుకు అందచేయాలనే చర్చని ట్రంప్ అధికార యంత్రాంగం రేగ్గొట్టింది.

ఉన్నత విద్య పరిశోధనలు చాలా ఖరీదైన వ్యవహారాలు. సైన్స్, సాంకేతిక రంగాలు, సామాజిక శాస్త్రాలు, సాంఘిక శాస్త్రాలు, కళారంగాలలో పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టడానికి అధిక మొత్తంలో నిధులు అవసరమవుతాయి. అభివృద్ధి సాధించడానికి సైన్స్, సాంకేతిక రంగాలలో పరిశోధనలు ఎంత అవసరమో సామాజిక శాస్త్రాల అధ్యయనాలు, పరిశోధనలు కూడా అంతే అవసరం. సామాజిక స్థితిగతులకు, అభివృద్ధికి అవినాభావ సంబంధం ఉంటుంది. సృజనాత్మకత బహుముఖీనంగా ఉంటుంది. శాస్త్ర పరిశోధనలకూ అలాంటి బహుముఖీన సృజనాత్మకత అవసరం.

ఉన్నత విద్య కోసం కేటాయించే నిధులు షరతులతో కూడుకుని ఉండకూడదు. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి పరిరక్షణ కోసం షరతులు లేని నిధులు అవసరం. ఉన్నత విద్యారంగంలో ప్రైవేటు పెట్టుబడులు శ్రేయస్కరం కాదు. ఎందుకంటే అవి లాభార్జన ధ్యేయంతో ఉంటాయి. అలాగే స్వయంప్రతిపత్తికీ అవకాశాలు అరుదుగా ఉంటాయి. అందుకే ఈ రంగానికి ప్రభుత్వ పెట్టుబడులు అవసరమవుతాయి. ఇది మన దేశానికే కాదు, అమెరికాకూ వర్తిస్తుంది.

మన దేశంలో శాస్త్ర పరిశోధనా రంగానికి, ప్రైవేటు రంగం పెట్టే పెట్టుబడులు బహు స్వల్పం. అందుకే ప్రభుత్వం ఈ రంగానికి భారీగా నిధులు కేటాయించాల్సి వస్తుంది. 1991లో మొదలయిన సంస్కరణల మూలంగా ఈ రంగానికి ప్రభుత్వ తలసరి కేటాయింపులు ఏటికేడాదికి తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఉన్నత విద్యాసంస్థలు నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. నిధుల కేటాయింపు సాకుతో విశ్వవిద్యాలయాల, విద్యారంగ స్వయం ప్రతిపత్తిని హరించి పాలక శక్తుల ఎజెండాను అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకుంటున్నది.

ఉన్నత విద్యాసంస్థలు సమకాలీన సామాజిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించే సంస్థలుగా మనగలగాలి. విశ్వవిద్యాలయాలు అసమ్మతి సృష్టించే నెలవులుగా భాసిస్తున్నప్పటికీ ఆ సాకున వాటి స్వయం ప్రతిపత్తిని దెబ్బతియ్యకూడదు. నూతన అన్వేషణల క్రమంలో విశ్వవిద్యాలయాలు సంప్రదాయ భావజాలాన్ని సవాలు చేసేవిగానే పనిచేస్తాయి. స్వల్పకాలిక, హ్రస్వ దృష్టితో విశ్వవిద్యాలయాల పనితీరును అంచనా వెయ్యడం మితవాద ధోరణులకు దారితీస్తుంది. కాల్పనిక సమాచారం విజ్ఞానంగా చలామణీ అయ్యే ప్రమాదం దాపురిస్తుంది. సమాజంలో విశ్వవిద్యాలయాలు పోషించాల్సిన గురుతర బాధ్యతకు చేటు తెస్తుంది. ఈ కారణంగా హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డాక్టర్ గార్బర్ స్వయంప్రతిపత్తి నిలబెట్టుకోవడం కోసం ప్రభుత్వ యంత్రాంగంతో సవాలు చెయ్యడానికి సిద్ధపడ్డారు.

(వ్యాసకర్త జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు, అర్థశాస్త్ర బోధకులు)

/ హిందూ సౌజన్యంతో /

సందర్భం

సికిల్ సెల్ ఎనీమియా - అవగాహన

దీర్ఘకాలం కామెర్లు ఉండటం, రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతుల వేళ్లు వాచి వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం ఈ సికిల్ సెల్ వ్యాధి ప్రధాన లక్షణాలుగా ఉంటున్నవి. ఈ వ్యాధి నిర్ధారణకు జరిపే ప్రాథమిక రక్త పరీక్ష ఖరీదు చాలా తక్కువలోనే ఉంటుంది. రక్త నమూనాను సోడియం మెటా బై సల్ఫేట్‌లో కలిపి మైక్రోస్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా? వంపు తిరిగి ఉన్నాయా? అని తెలుసుకోవడం ద్వారా వ్యాధి ఉందా లేదా అని నిర్ధారించుకోవచ్చు. ఈ వ్యాధి నిర్ధారణ ప్రాథమిక పరీక్షను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పిహెచ్‌సి) స్థాయిలోనే జరపవచ్చు.

సికిల్ సెల్ ఎనీమియా (కొడవలి కణ రక్తహీనత) అనేది వంశపారంపర్యంగా సంక్రమిస్తున్న రక్త రుగ్మత. సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రంగా పెప్పర్‌మింట్ల ఆకారంలో ఉంటాయి. ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంటాయి. అయితే కొంతమందిలో జన్యుసంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి (సికిల్) ఆకారంలోకి మార్పు చెందుతాయి. ఈ సికిల్ సెల్ ఉన్నవారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్ సెల్‌గానూ, ఒకటి మామూలుగానూ ఉన్నట్లయితే అటువంటి వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. వీళ్లకి మామూలుగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే వివాహం చేసుకున్న దంపతులకు ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టిన పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అటువంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. సాధారణ రక్త కణాల జీవితకాలం 120 రోజులైతే సికిల్ సెల్ రక్త కణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. సికిల్ సెల్ రక్త కణాల జీవిత కాలం తక్కువగా ఉండడం వలన, వేగంగా కొత్త ఎర్రరక్త కణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి కలిగిన వారు రక్తహీనతకు గురవుతారు. అంతేకాక సికిల్ సెల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటం వల్ల రక్తనాళాల్లో రక్తం సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందటం తగ్గిపోతుంది. అందువల్ల ఈ వ్యాధి ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోతే చిన్న తనంలోనే చనిపోతారు. ఈ వ్యాధిగ్రస్తుల సగటు జీవిత కాలం 42-48 సవత్సరాలు. జన్యుపరమైన మార్పుల వలన ఏర్పడుతున్న ఈ రక్తహీనత జబ్బుకు సరైన మందులు లేవు.

ఎం. అడివయ్య

భారత దేశంలో 17 రాష్ట్రాల్లో సికిల్ సెల్ డిసీజ్ సుమారు 20 లక్షల మంది కలిగి ఉన్నారని అంచనా. కేంద్ర ప్రభుత్వం మిషన్ మోడ్ 2047 పేరుతో సికిల్ సెల్ డిసీజ్ ను పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశ వ్యాప్తంగా 200 జిల్లాల్లో 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన 7 కోట్ల మంది గిరిజనులకు 2025-26 నాటికి ప్రత్యేకంగా వ్యాధి నిర్ధారణ కోసం స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించింది. కానీ 2022-23 సంవత్సరంలో 1 కోటి మందికి స్క్రీనింగ్ చేయాలని లక్ష్యం ఉండగా కేవలం 1,05,954 మందికి చేయగా 5,959 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన లెక్కల ప్రకారం 2016-18 సంవత్సరాలలో 1,13,83,664 మందికి స్క్రీనింగ్ చేస్తే 9,96,368 మందికి పాజిటివ్ రాగా, 9,49,057 మందికి వ్యాధి లక్షణాలున్నాయి. వారిలో 47,311 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. ప్రపంచంలోనే వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రతి సంవత్సరం సుమారు 40 వేల మంది పిల్లలు ఈ వ్యాధితో పుడుతున్నారని అంచనా. ప్రతి ఏటా 50 శాతం మంది పిల్లలు 5 సంవత్సరాల కంటే ముందే చనిపోతున్నారు. సికిల్ సెల్ రక్తహీనతతో పాటు రక్త రుగ్మతలు, రక్తాన్ని ప్రభావితం చేసే అనేక రకాల వ్యాధులను నివారించడానికి కేంద్ర కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసినా వాటిని అమలు చేయడానికి ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు

ఆటోసోమల్ రిసెసివ్ డిజార్డర్, గుర్తించకపోతే పేరెంట్ క్యారియర్‌ల ద్వారా ఒక తరం నుండి మరొక తరానికి వ్యాపిస్తుంది. తల్లిదండ్రులిద్దరిలో సికిల్ సెల్ హిమోగ్లోబిన్ లక్షణాలు ఉంటే ఈ వ్యాధి ఒక తరం నుండి మరొక తరానికి వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రాణాంతకమైన మలేరియా లక్షణం అయిన ప్లాస్మోడియం ఫాల్సిపరమ్ నుండి నుండి గిరిజనుల ప్రాణాలను కాపాడడంలో సికిల్ సెల్ డిసీజ్ దోహదపడుతుందని జబల్‌పూర్‌లోని ట్రైబల్ హెల్త్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అధ్యయనం వెల్లడించింది. పరీక్షల్లో మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన 78 శాతం ఆదివాసీలు ప్లాస్మోడియం ఫాల్సిపరమ్ లక్షణాన్ని కలిగి ఉండగా, సికిల్ సెల్ ఎనీమియా ఎక్కువగా ఉన్నందున గిరిజనుల్లో మరణాల సంఖ్య తక్కువగా ఉంది. "సికిల్ సెల్ ఎనీమియాతో ప్రజలు ఎక్కువగా బాధపడుతున్న ప్రదేశాలలో మలేరియా ప్రాబల్యం తక్కువగా ఉంటుంది. సికిల్ సెల్ ఎనీమియా రోగులలో కూడా మలేరియా వైరస్ లక్షణాలు తక్కువగా ఉంటాయి" అని జబల్‌పూర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీనియర్ పరిశోధకుడు డాక్టర్ జ్ఞాన్‌చంద్ చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న దాదాపు 10 లక్షల గిరిజన జనాభాలో కనీసం పది శాతం మందికి ఈ జబ్బు లక్షణాలు ఉన్నాయి. అంటే ఈ లెక్కన లక్ష మందికి సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు ఉండవచ్చని వివిధ సంస్థల అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో ఆంధ్రా యూనివర్సిటీ "హ్యూమన్ జెనెటిక్స్" విభాగం వారు జరిపిన పలు శాంపిల్ సర్వేల లెక్కల ప్రకారం ఉత్తరాంధ్ర ఏజెన్సీ పరిసర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనేతరుల్లో కూడా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి కలిగిన వారు రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఉపయోగపడే పోషక ఆహారాన్ని తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు రోజువారీ ఆహారంలో తప్పకుండా తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పోషక విలువలు కలిగిన బియ్యాన్ని సరఫరా చేయాలి. అయితే 2023-24, 2024-25, 2025-26 కేంద్ర బడ్జెట్లో ప్రభుత్వం ఆహార సబ్సిడీలకు నిధుల కేటాయింపులు భారీగా తగ్గించారు.

భారతదేశంలోని అధిక రాష్ట్రాలలో ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక నివారణ ప్రాజెక్టులను చేపట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక పరిశోధనాలయం కూడా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఈ వ్యాధి నివారణకు దీనిపై పరిశోధనకు రాయ్‌పూర్‌లో ప్రత్యేకంగా సికిల్ సెల్ ఇన్‌స్టిట్యూట్‌నే నెలకొల్పి 12.43 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. 2008లో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులు అధికంగా ఉండే 12 జిల్లాల్లో సికిల్ సెల్ ఎనీమియా కంట్రోల్ ప్రాజెక్టును చేపట్టింది. కేరళలో ఈ వ్యాధి బారిన పడినవారికి వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు ఇస్తున్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ కూడా ఇలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదు.

దీర్ఘకాలం కామెర్లు ఉండటం, రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతుల వేళ్లు వాచి వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం ఈ సికిల్ సెల్ వ్యాధి ప్రధాన లక్షణాలుగా ఉంటున్నవి. ఈ వ్యాధి నిర్ధారణకు జరిపే ప్రాథమిక రక్త పరీక్ష ఖరీదు చాలా తక్కువలోనే ఉంటుంది. రక్త నమూనాను సోడియం మెటా బై సల్ఫేట్‌లో కలిపి మైక్రోస్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా? వంపు తిరిగి ఉన్నాయా? అని తెలుసుకోవడం ద్వారా వ్యాధి ఉందా లేదా అని నిర్ధారించుకోవచ్చు. ఈ వ్యాధి నిర్ధారణ ప్రాథమిక పరీక్షను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పిహెచ్‌సి) స్థాయిలోనే జరపవచ్చు.

సికిల్ సెల్ వ్యాధి చికిత్సకు సరైన మందులు లేనందున, సికిల్ సెల్ క్యారియర్లను గుర్తించి వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు. ఈ వ్యాధిని త్వరితంగా నివారించాలని, నివారించకపోతే దుష్పరిణామాలు తప్పవని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా మన దేశంలో పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

/ జూన్ 19 అంతర్జాతీయ సికిల్ సెల్ రక్తహీనత అవగాహనా దినం /

/ వ్యాసకర్త ఎన్.పి.ఆర్.డి జాతీయ ఉపాధ్యక్షులు /

జనవాక్యం

జన గణన

ప్రపంచ జనాభాలో మొదటి స్థానంలో ఉన్న భారత దేశం, జనాభా లెక్కల ప్రక్రియను మొదలెట్టనుంది. అందుకుగాను కేంద్రం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దాని ప్రకారం దేశంలో రెండు విడతల్లో గణన జరిగి 2027 మార్చి ఒకటవ తారీకుకి కొత్త అధికారిక లెక్కలు పూర్తవుతాయి. ఇంతవరకూ 1971 జనాభా ఆధారంగా ఉండడం వల్ల, అప్పటికీ, ఇప్పటికీ అది ఎన్నో రెట్లు పెరగడం వల్ల నియోజక వర్గాలు కూడా ఎక్కువవుతాయి. వాటిని ఎలా వివాద రహితంగా పెంచాలన్నది పెద్ద సవాలు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు తాము నష్టపోగల పరిస్థితి పట్ల ఆందోళన వెలిబుచ్చుతూ, కేంద్రాన్ని హెచ్చరిస్తున్నాయి. అలాగే రానున్న ఎన్నికల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టసభలకు అన్వయి స్తామని పార్లమెంట్ చట్టం చేసింది. ఈసారి స్వతంత్ర భారత దేశంలో మొదటి సారిగా జనాభా లెక్కల్లో కుల గణన కూడా జరగబోతోంది. ఇప్పటి వరకూ కులాల విషయంలో 1931 లెక్కలే ప్రాతిపదికగా కొనసాగాయి. రానున్న కొత్త లెక్కలు మరింత వాస్తవ చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. అయితే అది రాజకీయ ప్రభావంతో కొత్త వివాదాల్ని తీసుకు రావచ్చు. ఏదేమైనా అసలు గణాంకాలు, వాస్తవ స్థితులు పారదర్శకంగా ప్రజల ముందు ఉండాలి. సామాజిక న్యాయం అమలు వాటిపైనే ఆధారపడి ఉంటుంది. కనుక ఖచ్చితత్వం తప్పనిసరి. ఆధునిక సాంకేతికత సాయంతో, రాజకీయ సంకల్పం తో జనగణన సజావుగా సాగాలి. భారత దేశం సంపన్న దేశంగానే కాకుండా ఆర్థిక, సామాజిక, ప్రాంతీయ అంతరాలు లేని దేశంగా రూపుదిద్దుకోడానికి జనగణన మొదటి మెట్టు.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ. విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

'ఉపాధి హామీ' చట్టబద్ధమైన హక్కు

- ఆగస్టు 1 నుంచి బెంగాల్‌లో ప్రారంభించాల్సిందే..
- కేంద్రాన్ని ఆదేశిస్తూ కోల్‌కతా హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

'ఉపాధి హామీ చట్టాన్ని ఎప్పటికీ నిలిపేసే హక్కు ఎవరికీ లేదు. ఇది చట్టబద్ధ హక్కు' అని కోల్‌కతా హైకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మూడేళ్ల క్రితం నిలిపివేసిన ఉపాధి హామీ చట్టాన్ని ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి మళ్లీ ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోల్‌కతా హైకోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో జరిగిన వేతనాల పంపిణీలోనూ, చట్టం అమలులోనూ అక్రమాలపై విచారణ కొనసాగించుకోవచ్చని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు అనుమతించింది. నిధుల దుర్వినియోగానికి సంబంధించిన విచారణ కొనసాగించవచ్చు కానీ, లక్షల మంది పేద గ్రామీణ కార్మికులకు ఉపాధి హక్కు నిలిపివేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో అమలు చేసేటప్పుడు ప్రభుత్వం ప్రత్యేక షరతులు విధించవచ్చని, లేదా అక్రమాలు జరగకుండా నిరోధించడానికి కేంద్రం చర్యలు తీసుకోవచ్చునని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని, రికవరీలు కూడా జరిగాయని, ఈ మొత్తాన్ని పశ్చిమ బెంగాల్‌లోని ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ రాష్ట్ర నోడల్ ఏజెన్సీ బ్యాంకు ఖాతాలో జమ చేసిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఉపాధి హామీని శాశ్వతంగా కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచడాన్ని ఊహించలేమని, రాష్ట్రంలో కొనసాగించడానికి కోర్టు ప్రయత్నం చేస్తుందని బెంచ్ పేర్కొంది.

స్వాగతించిన ఏఐఏడబ్ల్యుయు

ఈ తీర్పును అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయు) స్వాగతించింది. ఈ మేరకు బుధవారం ఏఐఏడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ప్రకటన విడుదల చేశారు. పనులు లేక బెంగాల్ నుంచి లక్ష మంది వలస పోయారని, టీఎంసీ, బిజెపి ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నాయని ఆయన విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం దొంగ నాటకాలు ఆడుతున్నాయని, రూ.వేల కోట్లు నిధులు పేదలకు అందకుండా మూడేళ్లుగా గ్రామీణ పేదలకు అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడేళ్ల నుంచి గ్రామీణ పేదలు ఉపాధి కోసం పెద్దయెత్తున ఉద్యమాలు చేస్తున్నారని, ఏఐఏడబ్ల్యుయు, సిఐటియు, ఏఐకెఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న మార్చ్ టు బ్రిగేడ్ కార్యక్రమం చేపట్టి లక్ష మందితో నిర్వహించినట్లు గుర్తు చేశారు. రోజు వేతనం రూ.600కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజల హక్కుల విజయానికి సంకేతమని అన్నారు.

మధ్యప్రదేశ్‌లో బరితెగించిన గోగూండాలు

- ముస్లిం వ్యక్తి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నలుగురు నిందితుల అరెస్ట్.. కేసులు నమోదు

భోపాల్ : బిజెపి పాలిత రాష్ట్రాల్లో గోగూండాల దాడులు తీవ్రమవుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో జరిగిన గోగూండాల దాడిలో గాయపడిన ముస్లిం మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. భోపాల్‌లోని జిన్సి ప్రాంతంలో జునైద్ ఖురేషి (35), ఆయన సహచరుడు అర్మాన్ కలిసి పశు వ్యాపారం నిర్వహించేవారు. ఈ నెల 5న మెహ్రాస్ గ్రామం వద్ద వీరు ఒక ట్రక్కులో ఏడు ఆవులు, ఒక ఎద్దును తరలిస్తుండగా, 20 నుంచి 25 మంది ఉన్న ఒక మూక గోరక్షణ పేరుతో అక్కడికి చేరుకున్నది. పశువులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నది. జునైద్ ఖురేషి, అర్మాన్‌లపై దాడికి దిగింది. ఆవులను డెయిరీ కోసం తరలిస్తున్నారని బాధితుల కుటుంబ సభ్యుడు మహ్ఫూజ్ ఖురేషి చెప్పారు. ఆ మూక బాధితులను బలవంతంగా ఆపి.. రాత్రంతా చిత్రహింసలు పెట్టి కొట్టారు. వారి వద్ద ఉన్న దాదాపు రూ.2 లక్షలను దోచుకున్నారు. దాడిలో ఖురేషి, అర్మాన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరిని చికిత్స కోసం భోపాల్‌లో గల హమీదియా ఆస్పత్రికి తరలించారు. ఐసియులో చికిత్స అందించారు. పరిస్థితి విషమించి ఖురేషి మంగళవారం ఉదయం మరణించాడు. ఇక అర్మాన్ పరిస్థితి విషమంగా మారింది. దాడి ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీసు అధికారి నితిన్ అహిర్వార్ తెలిపారు. వంద మంది పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 190 మృతదేహాల గుర్తింపు

- 159 శవాలు బంధువులకు అప్పగింత
- కొనసాగుతున్న డీఎన్ఏ పరీక్షలు

అహ్మదాబాద్ : "అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి గుర్తింపులకు ఇప్పటి వరకు 190 మృతదేహాలకు డిఎన్ఏ నమూనాలు సరిపోలాయి. 159 మృతదేహాలను ఇప్పటికే సంబంధిత కుటుంబాలకు అప్పగించాం. ఇతర మృతదేహాల (డిఎన్ఏ నమూనాలను) సరిపోల్చే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది" అని బుధవారం అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ జోషి తెలిపారు. జూన్ 12న 242 మంది ప్రయాణికులు, సిబ్బందితో లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 అహ్మదాబాద్‌లో కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న వారితో పాటు ఓ వైద్య గృహ సముదాయాన్ని ఢీకొట్టిన ఘటనలో మెడికల్ విద్యార్థులు కలిపి మొత్తం 274 మంది మరణించారు. విమాన ప్రమాదంలో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. విమాన ప్రమాదంలో చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో పాటు దెబ్బతినడంతో వారి గుర్తింపును నిర్ధారించడానికి అధికారులు డిఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం

ఎయిర్ ఇండియా ఏఐ-171 విమాన ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సిబ్బందిని కేంద్ర భద్రతా సంస్థలు ప్రశ్నించాయి. ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విమాన ప్రయాణానికి ముందు తనిఖీ, గ్రౌండ్ ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బందిని అందరినీ విచారించామని, వారి వాంగ్మూలాలను అధికారులు నమోదు చేశామని ఒక సీనియర్ అధికారి ధ్రువీకరించారు. విమానం టేకాఫ్ కావడానికి కొన్ని నిమిషాల ముందు దానిని నిర్వహించిన సిబ్బంది ఫోన్‌లను ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు ఉన్నాయా.. లేదా అని పరిశీలించడానికి స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తు పురోగతిలో భాగంగా ఏజెన్సీలు విమానాశ్రయ ప్రాంగణంలోని అనేక కోణాలను కవర్ చేసే సీసీటీవీ ఫుటేజ్‌లను కూడా భద్రపరిచాయి. ఎలాంటి వివరాలు విస్మరించబడకుండా చూసుకుంటున్నాయి.

ఒక వార్తా సంస్థతో అధికారులు మాట్లాడుతూ.. '360-డిగ్రీల దర్యాప్తు' జరుగుతోందని, ఊహాగానాలకు అవకాశం లేదని అన్నారు. మానవ తప్పిదం, సాంకేతిక వైఫల్యం, విధ్వంసంతో సహా అన్ని సాధ్యమైన ఆధారాలను చురుకుగా అన్వేషిస్తున్నామని చెప్పారు.

జూన్ 12న మధ్యాహ్నం విమానం కూలిపోయే ముందు పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు 'మేడే' అని కాల్ చేశాడు. ఇది విమానంలో విపత్కర వైఫల్యాన్ని సూచిస్తుంది. జూన్ 16న ఒక సాంకేతిక బృందం దర్యాప్తులో చేరడానికి బోయింగ్ నుంచి అహ్మదాబాద్‌కు వచ్చింది. ఈ సందర్భంగా విమానంలోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సివిఆర్), రెండవ బ్లాక్ బాక్స్ రెండింటినీ స్వాధీనం చేసుకున్నది. విమాన రికార్డర్లు ప్రమాదం జరిగిన చివరి క్షణాలను ఒకచోట చేర్చడంలో కీలకం. ఈ దర్యాప్తును ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) నిర్వహిస్తోంది. ఇది భారతదేశంలో జరిగిన అత్యంత దారుణమైన విమాన ప్రమాదాలలో ఒకదాని వెనుక ఉన్న కచ్చితమైన కారణాన్ని నిర్ధారించడానికి బోయింగ్ నిపుణులు, కేంద్ర నిఘా విభాగాలు, స్థానిక విమానయాన అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. పెరుగుతున్న ఆధారాలు, అధిక-వివాదాస్పద ప్రశ్నల తీవ్రత తరుణంలో, ఇప్పుడు దృష్టి అకస్మాత్తుగా ఎత్తు తగ్గడానికి కారణమేమిటి? దానిని నివారించడానికి ఏదైనా చేయగలిగి ఉండేదా అనే దానిపైకి మళ్లింది.

పాక్ ఆర్మీ చీఫ్‌తో ట్రంప్ భేటీ?

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను లంచ్‌కు ఆహ్వానించారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు వైట్‌హౌస్‌లోని కేబినెట్ రూమ్‌లో ఈ విందు సమావేశం జరుగనుంది. ఈ సమావేశాన్ని భారత్‌కు చెందిన పలువురు విశ్లేషిస్తున్నారు. ట్రంప్ తీరుపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఏ దేశ అధ్యక్షుడు లేదా ప్రధానితోనే సమావేశమవుతారు. అందుకు భిన్నంగా పాక్ ఆర్మీ చీఫ్‌తో ట్రంప్ భేటీ కానుండటం చర్చనీయాంశమైంది. ఇప్పటికే భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగేలా తాను మధ్యవర్తిత్వం వహించానని పదేపదే ట్రంప్ చెబుతూ వస్తున్నారు. ఈ ప్రకటనను భారత నేతలు పలు వేదికలపై ఖండించినా ట్రంప్ తన తీరు మార్చుకోవడం లేదు. పైగా జీ 7 సదస్సు నేపథ్యంలో మోడీ, ట్రంప్ భేటీ జరుగుతుందని అనుకున్నా, ట్రంప్ తన పర్యటనను కుదించుకుని వెళ్లిపోవడంతో మోడీ దాదాపు 15 నిముషాలపాటు ట్రంప్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. భారత్, పాక్ విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం తమకు అవసరం లేదని మోడీ స్పష్టం చేశారు. ఈ ఫోన్ తర్వాత కూడా ట్రంప్ వైఖరి మారలేదు. ఇటువంటి పరిస్థితుల్లో పాక్ ఆర్మీ చీఫ్‌తో ముఖాముఖి భేటీ కావడం వెనుక అమెరికా ఆలోచన ఏమిటా అని చర్చ జరుగుతోంది.

ఇకపై 15 రోజుల్లోనే ఓటర్ ఐడి కార్డులు

- కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఓటర్లకు ఐడి కార్డులు త్వరితగతిన అందించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్టు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఎన్నికల రిజిస్ట్రర్‌లో దరఖాస్తుకు సంబంధించిన మార్పులు జరిగిన 15 రోజుల్లోపే ఓటర్ ఐడీ కార్డులు (ఇపిఐసి) ఓటర్లకు చేరేలా ఈ కొత్త విధానం తీసుకొచ్చినట్టు పేర్కొంది.

కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్న వారితో సహా, ఇప్పటికే ఉన్న ఓటరు వివరాల్లో మార్పులు చేసిన వారికి కూడా 15 రోజుల్లోనే కార్డును డెలివరీ చేస్తామని వెల్లడించింది.

రియల్ టైమ్ ట్రాకింగ్

ప్రస్తుతం ఓటర్లకు ఓటర్ ఐడి కార్డులు అందడానికి ఒక నెలకు పైగా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయబోతున్నారు. ఈ కొత్త విధానంలో, ఓటర్ కార్డు తయారవడం నుంచి ఓటరుకు అందే వరకు ప్రతి దశలో పర్యవేక్షించడం కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్టు ఇసి వివరించింది. ఈ ప్రక్రియను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అంతేకాక, ప్రతి దశలో ఓటర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా ఓటర్లు తమ ఓటర్ ఐడీ కార్డు స్థితిని తెలుసుకోవడానికి వీలవుతుంది.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking | సిండికేట్ Syndicate

ఎ ఆర్ ఎమ్ (బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s కరుణశ్రీ ఆగ్రో ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, # 60-9-5, గౌతమి వీధి, సిద్దార్థనగర్, విజయవాడ-520010.
2. గుమ్మడి శ్రీదేవి, తండ్రి: గుమ్మడి వెంకట నరసయ్య, # 60-9-5, గౌతమి వీధి, సిద్దార్థనగర్, విజయవాడ - 520010. మరియు మరియొక చిరునామా: # 29 12 6, శ్రీ మిత్ర అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం. 301, వెంకటరత్నం వీధి, సూర్యారావు పేట, విజయవాడ - 520002.
3. శ్రీ గుమ్మడి వెంకట నరసయ్య, తండ్రి: వెంకటరామయ్య, శ్రీ మిత్ర అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం. 301, వెంకటరత్నం వీధి, సూర్యారావు పేట్, విజయవాడ - 520002.
4. శ్రీ వేదాల వెంకటేశ్వరరావు, తండ్రి: నారాయణ, యస్.నెం. 11, 72-77, బండగానిపల్లి గ్రామం, ఉదయగిరి మండలం, నెల్లూరు జిల్లా - 524226.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/సంస్థ 1. శ్రీమతి గుమ్మడి శ్రీదేవి, 2. శ్రీ గుమ్మడి వెంకటనరసయ్య, 3. శ్రీ వేదాల వెంకటేశ్వరరావు & M/s కరుణశ్రీ ఆగ్రో ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, తనఖాదారులు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి రూ. 1,41,73,126.60 (అక్షరాల ఒక కోటి నలభై ఒక్క లక్షల డెబ్బై మూడు వేల నూట ఇరవై ఆరు రూపాయలు మరియు అరవై పైసలు మాత్రమే) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 24.05.2017 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది మరియు సంక్షిప్త డిమాండ్ నోటీసు తేది 06.02.2018.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. 12.04.2018 & 17.04.2028 న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక/భౌతికంగా స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఆంధ్రజ్యోతి (తెలుగు) మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) రెండు వార్తాపత్రికలలో తేది 20.04.2018 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 13.06.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ. 22,94,57,830.02 (అక్షరాల ఇరవై రెండు కోట్ల తొంభై నాలుగు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల ముప్పై రూపాయలు మరియు రెండు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

కంకిపాడు యస్ఆర్ఒ., డాక్యుమెంట్ నెం. 2146/2000 ద్వారా గుమ్మడి శ్రీదేవి తండ్రి: గుమ్మడి వెంకట నరసయ్య పేరున ఎగ్జిక్యూట్ చేయబడినది. కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, గంగూరు గ్రామం & గ్రామ పంచాయతీ, సమీప డి.నెం. 4-95, ఆర్‌యస్ నెం. 221/3, 5 లో 773 7/9 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం. టైటిల్ హోల్డర్: గుమ్మడి శ్రీదేవి, తండ్రి: గుమ్మడి వెంకట నరసయ్య.

తేదీ: 13.06.2025, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

HDFC BANK We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., 50-96-5, ప్లాట్ నెం.75, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) (రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 ప్రకారం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, రిజిస్టర్డ్ కార్యాలయం బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి-400013 మరియు కార్యాలయం / రీజనల్ కార్యాలయం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, # 50-96-5, ప్లాట్ నెం.175, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 9వ నిబంధనతో చదివే 13(2)వ విభాగము క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణం తేది.01.02.2024 నాటికి రూ.4,64,82,003.52 పై (అక్షరాల నాలుగు కోట్ల అరవై నాలుగు లక్షల ఎనభై రెండు వేల మూడు రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే) తేది.01.07.2024 నుండి వడ్డీతో సహా చెల్లించమని కోరుతూ 1) మెస్సర్స్ శరవణ్ స్పైసెస్ (ఋణగ్రహీత), ప్రొప్రయిటర్ గా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు శ్రీ వట్టికూటి సైదారావు, డి.నెం.26/39/9/1/సి3, 7వ లైన్, ఏటి అగ్రహారం, గుంటూరు, గుంటూరు జిల్లా-522004. 2. శ్రీ వట్టికూరి సైదా రావు (ప్రొప్రయిటర్), తండ్రి : శ్రీ బసవయ్య వట్టికూటి, డోర్ నెం.1-103, లగడపాడు, ఉంటూరు, గుంటూరు జిల్లా -522402. 3. శ్రీమతి వట్టికూటి సందీప (హామీదారు), భర్త : వట్టికూటి సైదారావు, డి.నెం.26/39/9/1/సి3, 7వ లైన్, ఏటి అగ్రహారం, గుంటూరు, గుంటూరు జిల్లా-522004 వారిని కోరుతూ తేది.11.12.2024 న డిమాండ్ నోటీసు జారీచేసినారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., వారు తేది.16.06.2025 న లాంఛనాత్మక స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఛార్జికి పైన తెలిపిన బకాయి రూ.4,64,82,003.52 పై. మరియు దానిపై వర్తించు భవిష్య వడ్డీతో సహా లోబడి ఉంటాయని ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తులను తిరిగి పొందుటకు మరియు గడువు లభ్యతపై ఋణగ్రహీత/హామీదారులు(లు)/తనఖాదారు(లు) సదరు చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరాలు

షెడ్యూల్-ఎ: ఖాళీ ప్లాట్ ఆస్తి మొత్తం డోర్ నెం.255/బి1, ప్లాట్ నెం.270, ఎల్‌పి నెం. 2/98, చలపతి టౌన్‌షిప్‌లో, చలపతి ఇనిస్టిట్యూషన్స్ దగ్గర, అమరావతి రోడ్, లామ్ గ్రామం & పంచాయతీ, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా - 522 034 వద్ద ఉంది. 200 చదరపు గజాలు లేదా 4.13 సెంట్లు విస్తీర్ణం / విస్తీర్ణం **సరిహద్దులు:** (డాక్యుమెంట్ నెం.492/2004, తేదీ: 01.02.2004, తాడికొండ యస్ఆర్ఓ, శ్రీ వట్టికూటి సైదా రావు గారి డాక్యుమెంట్ ప్రకారం) **ఉత్తరం:** 33' వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్. నెం.283, **తూర్పు:** ప్లాట్ నెం.269, **పడమర :** ప్లాట్ నెం.271

షెడ్యూల్-బి: ఖాళీ ప్లాట్ ఆస్తి మొత్తం భాగం డోర్ నెం.427/ఎ2ఎ, పెట్రోల్ బంక్ దగ్గర, ధాత్రేయ స్వామి ఆలయం దగ్గర, సిరిపురం రోడ్, సిరిపురం గ్రామం & పంచాయతీ, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా - 522 401. విస్తీర్ణం/విస్తీర్ణం 1645.6 చదరపు గజములు లేదా 34 సెంట్లు, **సరిహద్దులు:** (డాక్యుమెంట్ నెం.1272/2015, తేదీ.20.02.2015 ప్రకారం, సత్తెనపల్లి యస్ఆర్ఓ, శ్రీ వట్టికూటి సైదారావు గారి డాక్యుమెంట్ ప్రకారం) **ఉత్తరం :** ములుపూరి కృష్ణారావు గారి భూమి, **దక్షిణం :** సుంకర కోటేశ్వరరావు గారి భూమి, **తూర్పు** వెలువోలు చిన అప్పయ్య గారి భూమి, **పడమర:** రోడ్డు.

షెడ్యూల్-సి: డోర్ నెం.139/4ఎ3, యర్రగుంటపాడు రోడ్, 113 తాళ్లూరు గ్రామం & పంచాయితీ, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా- 522 603 కు చెందిన ఖాళీ భూమి ఆస్తి యావత్తు (ఎ.1.371/2 సెంట్లు + ఎ.1.30 సెంట్లు) మొత్తం ఎ.2.675 సెంట్లు లేదా 267.5 సెంట్లు లేదా 12,947 చ.గ.లు. **హద్దులు :** (డాక్యుమెంట్ నం.3931/2015, తేదీ.02.09.2015 & డాక్యుమెంట్ నం.4467/2015, తేదీ.07.10.2015, ఫిరంగిపురం యస్ఆర్ఓ, శ్రీ వట్టికూటి సైదా రావు గారి డాక్యుమెంట్ పత్రం ప్రకారం) డాక్యుమెంట్ నెం.3931/2015, విస్తీర్ణం - ఎ.1.371/2 సెంట్లు : **ఉత్తరం :** మెట్టు సీతారావమ్మ భూమి, **దక్షిణం :** సర్కార్ డొంకలు, **తూర్పు :** వజ్రాల వెంకట్వేశ్వర రెడ్డి, **పడమర :** పాలపాటి రాము, పాలపాటి శ్రీనివాసరావు మరియు ఇతరులు భూమి.

డాక్యుమెంట్ నెం.4467/2015 ప్రకారం సరిహద్దు వివరాలు, విస్తీర్ణం - సుమారు 1.30 సెంట్లు : ఉత్తరం : దేగల సుందరయ్య, **దక్షిణం:** యజమానులు భూమి, **తూర్పు:** పొన్నెగంటి కాశిమ్మ భూమి, **పడమర :** చేజేటి రామిరెడ్డి మరియు ఇతరులు భూమి.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దిగువసంతకందారు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **12 జూన్, 2025న స్వాధీనం** చేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరిపేందుకు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో సమ్మిళితమైంది)** కు మొత్తం **రూ.రూ.26,21,809.00/-** (ఇరవై ఆరు లక్షల ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించి జరుపవలెను.

రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరణ

ఆంధ్రప్రదేశ్-522007, గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, ఆత్మకూరు, మూల్యాంకనం నం.718, డో.నం.210, డో.నం.5-79 వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఇంటి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఆస్తి మొత్తం ఏరియా 387.2 చ.గ.లు.

షెడ్యూల్ నం.1 (డాక్.నం.4301/2020) :
ఆంధ్రప్రదేశ్-522503, గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం డిఓ పంచాయతీ డో.నం.210, మూల్యాంకనం నం.718, డో.నం.5-79 లో ప్లింత్ ఏరియా 440 చ.అ.లు. షెడ్‌తో పాటు సైట్ మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ పరిధి 117.2 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు : తాత గోవర్ధన్‌రావు ఆస్తి (2వ షెడ్యూల్), పడమర : పంచాయతీ రోడ్డు, ఉత్తరం : తాత వీర భద్రం ఆస్తి, దక్షిణం : తాతా సుబ్బారావు ఆస్తి.**

షెడ్యూల్ నం.2 (డాక్.నం.4300/2020) :
ఆంధ్రప్రదేశ్-522503, గుంటూరు జిలఆల, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం డిఓ పంచాయతీ యొక్క డో.నం.210 తో పాటు మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ పరిధి 270 చ.గ.లు. (225.75 చ.మీ.లు.) తో అందులోని అన్నీ సౌలభ్య హక్కులు. మరియు **హద్దులు : తూర్పు : పంచాయతీ రోడ్డు, పడమర : తాత గోవర్ధన్ రావు ఆస్తి, ఉత్తరం : 3 అ.లు. వెడల్పు మార్గం, దక్షిణం : తాత శ్రీనివాసరావు ఆస్తి.**

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)

తేది : 12.06.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
రుణ ఖాతా నం : 10060581024

'లాటరల్ ఎంపిక'పై కేంద్రం యూటర్న్

- నిలిపివేయలేదని ప్రకటించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ : వివిధ మంత్రిత్వ శాఖల్లోని పోస్టుల ఎంపిక కోసం నిర్వహించే లాటరల్ ఎంట్రీ విధానంపై కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. ఈ విధానాన్ని రద్దు చేయలేదని, ఈ విధానం ఇప్పటికీ తెరిచే ఉందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ బుధవారం వెల్లడించారు. ఎన్‌డిఎ 11 ఏళ్ల పాలనపై జరిగిన విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... 'అట్టడుగు వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ప్రభుత్వ సేవల్లో సరైన ప్రాతినిధ్యం పొందటానికి రాజ్యాంగంలో ఈ విధానాన్ని పొందుపర్చారు. మేం దీన్ని నిలిపివేయలేదు. దీన్ని చాలా గొప్ప ఉద్దేశంతో ప్రారంభించారు' అని మంత్రి తెలిపారు. లాటరల్ ఎంట్రీని రద్దు చేసినట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ప్రకటించిన దాదాపు 10 నెలల తరువాత కేంద్ర మంత్రి ఈ విధంగా ప్రకటించడం విశేషం.

అమెరికా, జి-7 యుద్ధోన్మాదాన్ని ఖండించండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు

న్యూఢిల్లీ : ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న యుద్ధోన్మాద ప్రకటనలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ఉద్రిక్తతలు మరింత పెచ్చరిల్లుతాయని, మొత్తంగా పశ్చిమాసియా ప్రాంతాన్ని యుద్ధం, అస్థిరతల వైపు నెడతాయని హెచ్చరించింది.

ఇరాన్ నేతలను హతమారుస్తామంటూ అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు బహిరంగంగానే హెచ్చరించడం, పైగా ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని డిమాండ్ చేయడం తీవ్రంగా విచారించదగ్గ అంశమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. పశ్చిమాసియాలో అమెరికా మిలటరీ బలగాలను పెద్ద ఎత్తున సమీకరించడం చూస్తుంటే ఇరాన్‌పై దాడులు చేసేందుకై ఇజ్రాయిల్‌తో చేతులు కలపడానికి అమెరికా సిద్ధంగా వుందనే సంకేతాలు వెలువడుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాలు చాలా ప్రమాదకరమని, ఈ ప్రాంతాన్ని, ప్రపంచాన్ని వినాశకరమైన యుద్ధం అంచుకు నెట్టే ప్రమాదం వుందని పేర్కొంది.

కెనడాలో జరిగిన జి-7 సమావేశం చేసిన తాజా ప్రకటన ఈ యుద్ధోన్మాదాన్ని మరింత రెచ్చగొడుతోంది. ఇజ్రాయిల్ పాల్పడుతున్న దూకుడు, దురాక్రమణ చర్యలను పూర్తిగా విస్మరిస్తూ, మరోవైపు ఇరాన్‌ను మాత్రం జి-7 నిందించడం పూర్తిగా ఖండించదగిన అంశం. ఉద్రిక్తతలు పెచ్చరిల్లడానికి, పశ్చిమాసియాలో కొనసాగుతున్న అస్థిరతకు ప్రాథమిక బాధ్యత ఇజ్రాయిల్‌దే. గాజాలో మారణకాండను కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే సిరియా, లెబనాన్, యెమెన్, ఇప్పుడు ఇరాన్ సహా ఈ ప్రాంతంలోని ఇతర దేశాలకు కూడా సైనిక చర్యలను విస్తరిస్తూ వస్తోంది. ఇజ్రాయిల్‌ను నియంత్రించకుండా, ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలు అగమ్యగోచరమే

అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను దారుణంగా ఉల్లంఘిస్తూ పశ్చిమాసియాపై, ఇతర ప్రాంతాలపై తమ గుత్తాధిపత్యాన్ని అమలు చేసేందుకు అమెరికా, పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదం దుష్ట దేశమైన ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకుంటున్నాయి.

తమ దూకుడు చర్యలను తక్షణమే విరమించి, దౌత్య పంథాకు మళ్లేలా ఇజ్రాయిల్, అమెరికాలపై అత్యవసరంగా అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకురావాలి. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన అమెరికా అనుకూల, ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధానాన్ని విడనాడాలి. గ్లోబల్ సౌత్ (దక్షిణార్ధ గోళంలోని దేశాల) పట్ల నిజమైన నిబద్ధత ఉంటే ఇజ్రాయిల్ దాని ప్రధాన మద్దతుదారు అమెరికా దురాక్రమణ చర్యలకు తక్షణమే స్వస్తి పలకాలని ఇతర దేశాలతో కలిసి సమిష్టిగా డిమాండ్ చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో కోరింది.

అత్యంత తెలివితక్కువ చర్య!

- అణు విద్యుత్‌కు నిధుల నిషేధం ఎత్తివేతపై ఎడిబి అధ్యక్షుడికి ఇఎఎస్ శర్మ లేఖ
- అనవసరపు ఒత్తిళ్లకు తలొగ్గారంటూ విమర్శ

న్యూఢిల్లీ : అణు విద్యుత్‌కు నిధులు సమకూర్చడంపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) తీసుకున్న చర్య అత్యంత తెలివితక్కువ చర్య అని భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ విమర్శించారు. ఈ మేరకు ఎడిబి అధ్యక్షుడు మసాటో కాండాకు బుధవారం ఒక లేఖ రాశారు. గతంలో ఎడిబి బోర్డులో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించినందున, అణువిద్యుత్ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చకూడదన్న విధానాన్ని బ్యాంక్ అర్థంతరంగా సవరించుకుందన్న వార్తా కథనాలను చూసి తాను తీవ్రంగా విచారించినట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. 'కొద్ది రోజుల క్రితమే ప్రపంచ బ్యాంక్ కూడా ఇదే నిర్ణయం తీసుకున్న విషయాన్ని గమనంలోకి తీసుకుంటే రెండు అంతర్జాతీయ అభివృద్ధి ఆర్థిక సంస్థలు కూడా ఒకే రకంగా వ్యవహరించినట్లు కనిపిస్తోంది. ఈ సంస్థలు తగిన జాగ్రత్త లేదా శ్రద్ధ వహించి తీసుకున్న నిర్ణయంలా ఇది కనిపించడంలేదు. సంకుచిత వాణిజ్య ప్రయోజనాలను ప్రమోట్ చేసుకోవడం కోసం అణు రియాక్టర్లు, ఇంధన సరఫరాదారుల గ్రూపులు పదేపదే చేస్తున్న లాబీయింగ్‌కు తలొగ్గి తీసుకున్న నిర్ణయంలా కనిపిస్తోందని' ఆ లేఖలో శర్మ విమర్శించారు.

ఈ విషయమై ఎడిబి ఇప్పటికే నిర్ణయం తీసుకుంటే... అభివృద్ధి నిధులు, ప్రజా వనరులు కొన్ని కార్పొరేట్ సంస్థల పరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బయటినుండి వచ్చే ఒత్తిళ్లకు తలొగ్గరాదని కొద్దిమాసాల క్రితమే ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడిని హెచ్చరించినట్లు శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. అణు విద్యుత్ జీవితచక్రం అంచనాలపై పరిశోధనాల ఫలితాలను కూడా ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. ప్రపంచ బ్యాంక్, ఎడిబిలు తిరోగమన రీతిలో ఇటువంటి వైఖరిని తీసుకున్నాయంటే ఆ రెండు సంస్థలు అనవసరమైన ఒత్తిళ్ళను ఎదుర్కొన్నాయని, సంకుచిత కార్పొరేట్ ప్రయోజనాలను పెంచిపోషించేందుకు గానూ అభివృద్ధి నిధులు అందించే సంస్థలుగా తమ పాత్రను నీరు గార్చాయని అర్థమవుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎడిబి బోర్డు కొన్ని కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవాల్సి వుంటుందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. తగిన దృష్టి పెట్టకుండా తొందరపాటుతో ఇటువంటి కీలక నిర్ణయాలు తీసుకుని విధానాలు సవరించడంవల్ల ఇప్పటివరకు వున్న విశ్వసనీయత తుడిచిపెట్టుకుపోతుందని ఆయన హెచ్చరించారు. అణు విద్యుత్‌కు నిధులు సమకూర్చరాదంటూ కాల పరీక్షకు నిలిచిన ఇటువంటి విధానాన్ని మార్చకుండా ఎడిబి, బోర్డు సభ్యులు సంయమనం పాటించాలని కోరారు.

కొత్త ప్రాజెక్టులకు సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. కెజి టు పిజి కరిక్యులమ్‌లో మార్పులు తెస్తున్నామన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అభివద్ధికి సహకరించండి

పండ్లతోటల అభివృద్ధికి అన్ని విధాలా అనుకూలమైన వాతావరణం కలిగిన రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆ రంగంలో పెట్టుబడులకు సహకారం అందించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ట్రిపుల్ ఐటిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా జులై 11, 12 తేదీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దామని తెలిపారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌తోనూ మంత్రి లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మరింత వేగవంతమైన అభివృద్ధికి సహకరించాలని కోరారు. లోకేష్ వెంట కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బైరెడ్డి శబరి, సానా సతీష్, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కేశినేని శివనాథ్, బస్తిపాటి నాగరాజు ఉన్నారు.

ఎన్నికల హామీలను వేగంగా అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన తెలుగుదేశం, జనసేన పార్టీలు నేడు అదే విధానాన్ని అమలు చేయడం ప్రజలను వంచించడమే. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని ప్రజలకు పిలుపునిచ్చిన తెలుగుదేశం నాయకులు నేడు పగులగొట్టిన ప్రజలపై పోలీసు కేసులు పెడుతున్నారు. రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అనుమతిస్తూ ఎపిఇఆర్‌సి ఇచ్చిన తీర్పును సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించకుండా డిస్కంలకు ఆదేశాలు జారీ చేయాలని సమావేశం డిమాండ్ చేసింది.

స్మార్ట్‌మీటర్లు బిగించినచోట బిల్లులు ఎక్కువ వస్తున్నాయి. ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. మీటర్ల ఏర్పాటుకు అదానీ కంపెనీకి గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు కొనసాగిస్తున్నది. సెకీ ద్వారా అదానీతో జరిగిన అవినీతికర విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా విద్యుత్ భారాలు తగ్గిస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమే. రూ.1.20 లక్షల కోట్ల అదనపు భారాన్ని వినియోగదారులపై మోపడానికి ఈ ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొంది. వెంటనే సెకీ ఒప్పందాలను రద్దుచేయాలని, బిల్లుల భారం మోపే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, లేదంటే ప్రజలే వాటిని బిగించకుండా అడ్డుకోవాలని విస్తృత సమావేశం విజ్ఞప్తి చేసింది.

అందరికీ సంక్షేమ పథకాల అమలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నెలకు రూ.25 వేలలోపు ఆదాయం ఉండే వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించి దానికి భిన్నంగా నేడు సంక్షేమ పథకాలపై అడ్డగోలు షరతులు పెట్టి కోతలు విధిస్తోందని సమావేశం తెలిపింది. రూ.15 వేల చొప్పున తల్లికి వందనం అమలు చేస్తున్నామని తల్లుల అకౌంట్లలో రూ.13,000 మాత్రమే వేస్తున్నారని పేర్కొంది. పారిశుధ్య కార్మికులకు ఇస్తామని ఉత్తర్వులిచ్చినప్పటికీ లాక్ ఓపెన్ కావడం లేదని నిరాకరిస్తున్నారని, అతి తక్కువ ఆదాయాలు వస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో అమలు చేయడం లేదని తీర్మానం తెలిపింది. కేవలం సిఎఫ్ఎంఎస్ వేతనాలు తీసుకున్నంత మాత్రాన ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వీరిలో అనేకమందికి రూ.10 వేలు అంతకన్నా తక్కువ వేతనం వచ్చేవారేనని వివరించింది.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.25 వేలు ఆదాయాలు వస్తున్నాయి. అంగన్‌వాడీ వర్కరుకు రూ.11,500, హెల్పరుకు రూ.7,000, ఆశాలకు రూ.10,000 మాత్రమే ఇస్తున్నారని, కావున ప్రభుత్వ ఉద్యోగులు అనే విధానాన్ని తొలగించి గ్రామాల్లో రూ.20,000, పట్టణాల్లో నెలకు రూ.25,000లోపు ఆదాయం వచ్చే వారందరికీ తల్లికి వందనం సహా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తున్నది.

జిఓ 30 అమలు చేసి పేదల ఇళ్లకు వెంటనే పట్టాలివ్వాలి

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు జిఓ 30 ప్రకారం ఇంటి పట్టాలివ్వాలని, ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు నెలరోజుల్లో ఇంటి పట్టాలు ఇస్తామని జనవరిలో జిఓను విడుదల చేసి ఇప్పటి వరకు అమలుకు చర్యలు తీసుకోవడం లేదని తీర్మానంలో పేర్కొంది.

ఈ జిఓ తెచ్చిన విషయాన్ని ప్రజల్లో ప్రచారం చేయడం లేదని, ఇంటి పట్టాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తహశీల్దారు కార్యాలయాలకు దరఖాస్తులు పెట్టుకున్నారని, కొందరు అధికారులు అర్జీలు తీసుకోకపోవడం, తీసుకున్న అర్జీలను పరిశీలించి అర్హుల లిస్టు ప్రకటించకపోవడం జరుగుతోందని వివరించారు. ఒకవైపు జిఓ ఇచ్చిన ప్రభుత్వం మరోవైపు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో పేదల గుడిసెలను కూల్చివేత చేపట్టిందని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న వారందరికీ పట్టాలివ్వాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

విశాఖ 'ఉక్కు' ప్రైవేటీకరణ నిలిపివేస్తూ ప్రధాని ప్రకటించాలి

ఈ నెల 21న విశాఖపట్నం వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది. ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలు అమలు జరపకుండా ఒట్టిమాటలతో తాత్సారం చేస్తూ మరోవైపు యోగాంధ్రా అంటూ మోడీ భజనలో రాష్ట్ర ప్రభుత్వం మునిగిపోయిందని విమర్శించింది. విశాఖ ఉక్కుతో సహా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి రాష్ట్రం హక్కులు కాపాడడానికి బదులు తాకట్టు పెడితే గత ప్రభుత్వంలాగే ఈ ప్రభుత్వం కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సమావేశం హెచ్చరించింది.

సమావేశ నిర్వహణకు పలు కమిటీలు

రెండు రోజులపాటు జరిగే సమావేశ నిర్వహణకు పలు కమిటీలు ఏర్పాటు చేశారు. వీటిల్లో మినిట్స్ కమిటీ సభ్యులుగా టి అరుణ్, కందారపు మురళి, వై రాము, కె ప్రసన్నకుమార్, వి నాగరాజు, తీర్మానాల కమిటీ సభ్యులుగా కె ప్రభాకరరెడ్డి, డి రాంభూపాల్, డి సుబ్బారావు, కె ధనలక్ష్మి, రామన్న, అశోక్, ఏర్పాట్ల కమిటీ సభ్యులుగా జె జయరాం, ఎం సూర్యారావు, యువి రామరాజు, పి రామ్మోహన్, టి క్రాంతి, ఆర్ రాఘవేంద్ర ఉన్నారు. కార్ల్‌మార్క్స్ రచించిన 'పెట్టుబడి' గ్రంథాన్ని తెలుగులో సులభంగా అర్థమయ్యేలా కవితల రూపంలో సీనియర్ పాత్రికేయులు వి వెంకటేశ్వర్లు తీసుకొచ్చిన 'సింధూరం' పుస్తకాన్ని బివి రాఘవులు ఆవిష్కరించారు. రచయితను రాఘవులు అభినందించారు.

పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిహెచ్ నర్సింగరావు, చిత్రంలో వి శ్రీనివాసరావు తదితరులు

అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

మేరకు గత పది రోజులుగా నిఘా పెట్టారు. వారి కదలికలను గమనిస్తూ మంగళవారం రాత్రి గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ చేపట్టారు. మావోయిస్టుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వద్దకు మీడియాను పోలీసులు అనుమతించలేదు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు అప్పగించనున్నారు.

ఇరాన్ ఎన్నటికీ లొంగదు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోగించినట్లు ఇరాన్ తెలిపింది. ఆపరేషన్ హానెస్ట్ ప్రామిస్-3లో భాగంగా హైపర్ సోనిక్ ఫతా -1 క్షిపణులను ప్రయోగించామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఒక ప్రకటనలో తెలిపింది. హైపర్ సోనిక్ క్షిపణులు ధ్వని వేగం కంటే ఐదు రెట్లు అధిక వేగంతో ప్రయాణించగలవు. వీటిని ట్రాక్ చేయడం, అడ్డుకోవడం కష్టతరం.

585 మంది మృతి

ఇరాన్‌వ్యాప్తంగా ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 585మంది మరణించగా, 1,326మంది గాయపడినట్లు వాషింగ్టన్‌కు చెందిన మానవహక్కుల సంస్థ బుధవారం ప్రకటించింది. మృతుల్లో 239మంది పౌరులు, 126మంది భద్రతా సిబ్బంది వున్నట్లు వెల్లడించింది.

ఆయుధాల ఫ్యాక్టరీలపై ఇజ్రాయిల్ దాడులు

ఇరాన్ పౌరులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్, అమెరికా బెదిరింపులకు దిగుతున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు ఇరాన్ రాజధాని టెహరాన్ లక్ష్యంగా ఇజ్రాయిల్ యుద్ధ విమానాలతో దాడి జరిపింది. టెహరాన్‌లోని ఆయుధాల తయారీ కేంద్రం, సెంట్రిఫ్యూజ్‌లను తయారు చేసే ఫ్యాక్టరీపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. రక్షణ కావాలంటే ప్రజలు తక్షణమే రాజధాని నగరాన్ని వీడాలని ఇప్పటికే ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరికలు చేసింది.

నటాంజ్ అణు కేంద్రం ధ్వంసం

ఇరాన్‌లో అత్యంత రహస్యమైన, సురక్షితమైన అణు కేంద్రాలలో ఒకటైన భూగర్భంలోని నటాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి చేసినట్లు ఐక్యరాజ్య సమితి అణు సంస్థ ప్రకటించింది. నాటాంజ్ యురేనియం శుద్ధి కర్మాగారంపై ఇజ్రాయిల్ నేరుగా దాడి చేసిందని, కొంతమేరకు ధ్వంసమైందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) తెలిపింది. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ ఆధారంగా నాజాంజ్‌పై దాడిని గుర్తించినట్లు ఐఎఇఎ తన ఎక్స్ పోస్టులో పేర్కొంది. ఇరాన్‌లోని మరో రెండు అణు కేంద్రాలు ఇస్ఫహాన్, ఫోర్డోపై ఎలాంటి ప్రభావం లేదని పేర్కొంది.

రష్యా హెచ్చరిక

ఇజ్రాయిల్‌కు నేరుగా సైనికసాయం చేయొద్దంటూ రష్యా బుధవారం అమెరికాను హెచ్చరించింది. దీనివల్ల మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మరింత క్షీణిస్తాయని పేర్కొంది. ఈ మేరకు రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రి సెర్గి రిబకొవ్ చేసిన వ్యాఖ్యలను రష్యామీడియా వెల్లడించింది.

హోర్ముజ్‌పై ఇరాన్ నియంత్రణ

హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణకు ఇరాన్ మాజీ ఆర్థిక మంత్రి ఇషాన్ ఖండూజి పిలుపునిచ్చారు. ఇరాన్ అనుమతితోనే ట్యాంకర్లు, ఎల్ఎన్‌జి కార్గోలు హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తాయని ప్రకటించారు. ఈ విధానం గురువారం నుండి వంద రోజుల పాటు అమలు చేయాలన్నారు. తక్షణమే ఈ విధానాన్ని అమలు చేస్తేనే ఫలితం వుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

మానవత్వంపై యుద్ధమే : ఇరాన్ రాయబారి

మానవత్వానికి మచ్చ తెచ్చేలా ఇజ్రాయిల్ చర్యలు వున్నాయని బుధవారం ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలిలో ఇరాన్ రాయబారి అలీ బహెరిని వ్యాఖ్యానించారు. అణు కేంద్రాలను ఉద్దేశ్యపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడమంటే అంతర్జాతీయ చట్టాలను, ఐరాస నిబంధనావళిని ఉల్లంఘించడమేనని విమర్శించారు.

ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్లతో సిఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. చిత్తూరు, కర్నూలు, కాకినాడ, అనంతపురం, నెల్లూరు జిల్లాల అధికారులతో మాట్లాడుతూ.. జిఎస్‌టి, పన్నుల వసూళ్లపై అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలను సాధిస్తున్న అధికారులను అభినందించారు.

ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం

ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని సిఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలే ఇందుకు కారణమని, వాటిని సరిచేస్తే ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. విశాఖ, విజయవాడ వంటి నగరాల నుంచి ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. గతేడాదితో పోల్చిచూస్తే ఏప్రిల్, మే నెలల్లో ఆదాయం పెరిగినట్లు సిఎం దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. జిఎస్‌టి కూడా క్రమంగా మెరుగవుతున్నట్లు వారు చెప్పారు. 5.71 శాతం వరకు జిఎస్‌టి, వాణిజ్య పన్నులు పెరిగినట్లు వివరించారు. కొత్త మద్యం విధానం వచ్చిన తరువాత రూ.2,432 కోట్లు వరకు ఆదాయం పెరగనున్నట్లు ఆ శాఖ అధికారులు వివరించారు. గనులశాఖకు సంబంధించి ఆదాయం పెంపునకు ఉపగ్రహ సమాచారాన్ని ఉపయోగించుకోవాలని, దీనివల్ల 30 నుంచి 40 శాతం వరకు ఆదాయం పెరుగుతుందని సూచించారు.

పనితీరు ఆధారంగానే పోస్టింగ్‌లు

ఆదాయ వనరుల శాఖల్లోని కీలక విభాగాల్లో పనితీరు, ప్రతిభ ఆధారంగానే అధికారులు, సిబ్బందిని నియమించాలని సిఎం ఆదేశించారు. సరైన వ్యక్తులు ఉంటేనే సరైన ఫలితాలు కూడా వస్తాయన్నారు. దీనిపై విస్తృతంగా కసరత్తు చేయాలని శాఖలకు సూచించారు. ఈ సమీక్షలో ఆయా ఆదాయ వనరుల శాఖల అధికారులు పాల్గొన్నారు.

బనకచర్లపై న్యాయ పోరాటం చేస్తాం

- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి
- అఖిలపక్ష ఎంపిలతో భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి జలాలను తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయంలో న్యాయపోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే సిడబ్ల్యుసి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి పరిస్థితిని వివరిస్తామని చెప్పారు. ఈ అంశంపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అఖిలపక్ష ఎంపిల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం, బిఆర్ఎస్ ఎంపిలు హాజరయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు జరిగే నష్టంపై ఆ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంపిలకు వివరించారు.

గోదావరి జలాలను రాయలసీమ తరలించేందుకు అభ్యంతరంలేదని ముఖ్యమంత్రి హోదాలో స్వయంగా కెసిఆర్ చేసిన ప్రకటనల వీడియో క్లిప్పింగులను సమావేశంలో ప్రదర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు ఫీజుబులిటీ రిపోర్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిందని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా మనమంతా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించే విషయంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ సిఎం, మంత్రులతో మాజీ సిఎం కెసిఆర్ నాలుగు సార్లు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. ఆ సమావేశాల మినిట్స్‌ను రిఫరెన్స్‌గా చూపి బనకచర్లను తెలంగాణకు గుదిబండగా మార్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కలిసికట్టుగా ముందుకుపోవాలని ఎంపిలను సిఎం రేవంత్ రెడ్డి కోరారు.

మధ్యవర్తిత్వానికి అంగీకరించం

- కాల్పుల విరమణపై ట్రంప్‌తో మోడీ చెప్పారు
- విక్రమ్ మిస్రి ప్రకటన

న్యూఢిల్లీ : అమెరికా మధ్యవర్తిత్వం కారణంగానే భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ జరిగిందన్న వాదనను ప్రధాని నరేంద్ర మోడీ తోసిపుచ్చారు. ఇరు దేశాల సైన్యం మధ్య నేరుగా జరిగిన చర్చలే కాల్పుల విరమణకు కారణమని, అమెరికా మధ్యవర్తిత్వం కాదని, వివాద పరిష్కారంలో మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోమని ప్రధాని చెప్పినట్లు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోడీ మంగళవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో టెలిఫోన్‌లో సంభాషించారని ఆయన తెలిపారు. అణ్వాయుధ దేశాలైన భారత్, పాకిస్తాన్ అమెరికా జరిపిన మధ్యవర్తిత్వ చర్చల తర్వాతే కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ పదే పదే చెబుతూ వస్తున్నారు. యుద్ధంపై కాకుండా వాణిజ్యంపై దృష్టి పెట్టాలని తాను రెండు దేశాలకూ సూచించానని కూడా ఆయన తెలిపారు. ట్రంప్ ప్రకటనను మోడీ ఖండించకపోవడంతో దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే.

కెనడాలో జరిగిన జి-7 దేశాల సదస్సు సందర్భంగా మోడీ ఫోన్‌లో ట్రంప్‌తో మాట్లాడారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఘర్షణలు జరిగిన తర్వాత వీరిద్దరూ సంభాషించుకోవడం ఇదే మొదటిసారి. 'భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కానీ, భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వంపై కానీ ఏ దశలోనూ చర్చలు జరగలేదని ట్రంప్‌తో మోడీ స్పష్టంగా చెప్పారు' అని విక్రమ్ మిస్రి పేర్కొన్నారు. సైనిక చర్య నిలిపివేతపై రెండు దేశాల సైనికాధికారుల మధ్య నేరుగా చర్చలు జరిగాయని, పాకిస్తాన్ కోరికపై అధికారులు పరస్పరం సంప్రదింపులు జరిపారని ఆయన వివరించారు. మధ్యవర్తిత్వాన్ని గతంలో భారత్ ఎన్నడూ అంగీకరించలేదని, భవిష్యత్తులో కూడా అంగీకరించబోదని మోడీ చెప్పినట్లు పేర్కొన్నారు. జి - 7 సదస్సు సందర్భంగానే ఇరువురు నేతలు కలవాల్సి ఉన్నప్పటికీ మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ట్రంప్ ఒక రోజు ముందే కెనడా నుండి బయలుదేరారని మిస్రి తెలిపారు.

మోడీ - ట్రంప్ టెలిఫోన్ సంభాషణపై శ్వేతసౌధం ఇప్పటి వరకూ స్పందించలేదు. ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న పోరుకు ట్రంప్ మద్దతు తెలుపగా, ఆపరేషన్ సిందూర్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నదని మోడీ చెప్పారని మిస్రి వివరించారు. 'కెనడా నుండి తిరిగి వచ్చేటప్పుడు అమెరికాలో ఆగగలరా అని మోడీని ట్రంప్ అడిగారు. ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల కారణంగా ఆగలేనని మోడీ జవాబిచ్చారు. క్వాడ్ గ్రూప్ నేతల సదస్సు సందర్భంగా భారత్‌లో పర్యటించాల్సిందిగా ట్రంప్‌ను మోడీ ఆహ్వానించగా ఆయన అంగీకరించారు' అని తెలిపారు. ప్రతి విషయంపై ఎక్స్‌లో పోస్ట్ చేసే ప్రధాని మోడీ... కీలకమైన భారత్, పాక్ కాల్పుల విరమణ అంశంపై ఎక్స్‌లో పోస్టు చేయకపోవడం గమనార్హం.

వివాదాలతో ముగిసిన జి 7 సదస్సు!

- అభిప్రాయ భేదాలు, వాదోపవాదాలు
- ఉక్రెయిన్‌పై లేని సంయుక్త ప్రకటన

కనానాస్కిస్ : వివాదాలతో జి 7 సదస్సు ముగిసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేకుండానే కనానాస్కిస్‌లో సదస్సు చివరి రోజైన మంగళవారం జి 7 దేశాల నేతలు సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించినా, ఎలాంటి సంయుక్త ప్రకటన లేదా డిక్లరేషన్ లేకుండా సదస్సు ముగిసింది. సదస్సు ముగిసిన తర్వాత అనేక ప్రకటనలు లేదా నేతల హామీలు వెలువడ్డాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎఐని సురక్షితమైన, బాధ్యతాయుతమైన, విశ్వసనీయమైనరీతిలో అమలు చేయాలని, డిజిటల్ అంతరాలను రూపుమాపాలని, ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి వీలుగా సాంకేతికతను పూర్తి స్థాయిలో ఉపయోగించుకునేలా పరస్పర సహకారం పెంపొందించుకోవాలని, అంతర్జాతీయ సవాళ్ళను పరిష్కరించుకోవాలని, ప్రజల భద్రతకు హామీ కల్పించాలని ఇలా పలు ప్రకటనలు జారీ అయ్యాయి.

సదస్సు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో కెనడా ప్రధాని మార్క్ కార్నే మాట్లాడుతూ, రెండు రోజులుగా జరిగిన చర్చలు అరమరికలు లేని రీతిలో సాగాయని చెప్పారు. అనేక అంశాలపై వివిధ రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయన్నారు. వ్యూహాత్మక మార్పిడులు జరిగాయన్నారు. కొన్ని సమస్యలకు ఉమ్మడి పరిష్కారాలు కనుగొనేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయన్నారు. బహుళపక్షవాదం తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్న సమయంలో ఇది చాలా విలువైనదని కార్నే వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌పై సంయుక్త ప్రకటన చేయలేదు. కెనడా మాత్రం ఉక్రెయిన్‌కు మద్దతుగా రష్యాపై మరికొన్ని ఆంక్షలను విధించింది.

మరోవైపు సదస్సు జరుగుతుండగా, కాల్గరీ, బాన్ఫ్ వీధుల్లో వందలాదిమంది ఆందోళనకారులు నిరసనలు నిర్వహించారు. కెనడాను ఆక్రమించుకుంటామని ట్రంప్ చేసిన బెదిరింపులను నిరసించారు. పలు సమస్యలకు పరిష్కారాలు కావాలంటూ వారు నినాదాలు చేశారు.

పాలన వదిలేసి కక్ష సాధింపులు

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మహత్య చేసుకున్నారని జగన్ ఆరోపించారు. నాగమల్లేశ్వరరావు మృతి చెంది ఏడాది అయిన సందర్భంగా గ్రామంలో ఆయన విగ్రహన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని జగన్ ఆవిష్కరించారు. మల్లేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లును పరామర్శించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొంత మంది పోలీసు అధికారులు కుల ఉన్మాదంతో వ్యవహరిస్తున్నారని వారికి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సినిమా చూపిస్తామన్నారు. ఇటీవల రాజుపాలెం మండలం కోటనెమలిపురి గ్రామంలో లక్ష్మీనారాయణ అనే వైసిపి కార్యకర్తను సత్తెనపల్లి డిఎస్‌పి హనుమంతరావు వేధించారని దీంతో ఆయన ఆత్మహత్యయత్నం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని చెప్పారు. వైసిపిలోని వల్లభనేని వంశీ, కొడాలి నాని, దేవినేని అవినాష్, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, అన్నాబత్తుని శివకుమార్, పోసాని కృష్ణమురళీ, మంగళగిరికి చెందిన రాజ్‌కుమార్, కృష్ణవేణి, ఇంటూరు రవి తదితరులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని విమర్శించారు. పోలీసులు చంద్రబాబు చేసే పాపాల్లో భాగస్వామ్యం కావద్దని హితవు పలికారు. మరో నాలుగేళ్లలో పరిస్థితులు మారతాయని, తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఇప్పుడు తప్పులు చేసిన అధికారులకు సినిమా చూపిస్తాం అని హెచ్చరించారు. చంద్రబాబు పాలనపై వ్యతిరేకత వచ్చిందని మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

8లక్షల మంది అన్నదాతలకు సుఖీభవ కోత

(మొదటిపేజీ తరువాయి)

వర్తింపజేసినా, అన్నదాతా సుఖీభవకు వారిని ఈ ప్రభుత్వం అనర్హులుగా పేర్కొంది. వెబ్‌సైట్‌లో ఆ రైతుల భూములను ప్రభుత్వ భూములుగా చూపించడంతో అధికారులు వారిని పరిగణించలేదు. దీంతో లక్షలాది మంది రైతులు సాయానికి నోచని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కౌలు రైతులకూ సాయం అందే పరిస్థితి లేదు. అన్నదాతా సుఖీభవ వడపోతకు సంబంధించి ప్రభుత్వం అనేక నిబంధలను అనుసరించింది. ఒక రేషన్ కార్డులో రెండు, మూడు కుటుంబాలున్నా ఒకే కుటుంబానికి ఈ పథకాన్ని వర్తింపజేసింది. ప్రయివేట్ ఉద్యోగులు పిఎఫ్ పొందితే వారిని అనర్హులుగా తేల్చింది. ఆదాయపన్ను చెల్లించే పిల్లలు ఉన్న రైతు కుటుంబాలకూ సాయం జాబితాలో చోటు కల్పించలేదు. కుటుంబ సభ్యులంతా ఒకే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉంటే అందులో ఎవరికైనా పిఎఫ్ వర్తిస్తే వారికి సాయం నిరాకరించింది.

జిల్లా పేరు	అర్హులైన రైతులు	జిల్లా పేరు	అర్హులైన రైతులు
అల్లూరి సీతారామరాజు	1,44,457	ఎన్‌టిఆర్	1,18,304
అనకాపల్లి	2,33,260	పల్నాడు	2,39,110
అనంతపురం	2,70,477	పార్వతీపురం మన్యం	1,18,274
అన్నమయ్య	1,86,654	ప్రకాశం	2,51,301
బాపట్ల	1,59,157	శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	1,77,535
చిత్తూరు	2,08,272	శ్రీ సత్యసాయి	2,58,561
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ	1,37,014	శ్రీకాకుళం	2,78,292
తూర్పుగోదావరి	1,14,049	తిరుపతి	1,45,255
ఏలూరు	1,62,085	విశాఖపట్నం	17,776
గుంటూరు	1,07,943	విజయనగరం	2,26,792
కాకినాడ	149,408	పశ్చిమ గోదావరి	1,05,597
కృష్ణా	1,34,027	వైఎస్సార్ కడప	1,79,843
కర్నూలు	2,55,265		
నంద్యాల	1,85,297	**మొత్తం**	**45,64,005**

జీవన సౌరభం

గమ్యమంటూ లేనివారికి ఏ లాంతరూ దారి చూపదు.

మీకోసం

నిల్వ ఉంచిన బియ్యం డబ్బాలో గానీ, బస్తాలో గానీ కొబ్బరి పెంకులను ముక్కలుగా చేసి ఉంచితే పురుగు పట్టకుండా ఉంటుంది.

సెలవులు సరదాగా గడిచాయి



హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు దీక్ష. నేను ఆరవ తరగతి చదువుతున్నాను. వేసవి సెలవుల్లో నేను తిరుపతి వెళ్లాను. తిరుపతి చాలా అందంగా ఉంది .అక్కడ ప్లాస్టిక్ ఉపయోగించరు. అక్కడ నేను ఏనుగును చూశాను. భలే సంతోషం వేసింది. తిరుపతి నుంచి వచ్చాక నేను, మా తమ్ముడు కలిసి ఇంట్లో చాలా పనులు చేశాం. బొమ్మలు గీసాం. మొక్కలు నాటాం. అవి ఇప్పుడు పెద్దవయ్యాయి కూడా. నేనైతే అమ్మకి సాయం చేశాను. అలాగే నృత్యం నేర్చుకున్నాను. మా తమ్ముడు చెస్ నేర్చుకున్నాడు. హిందీ ,తెలుగు, ఇంగ్లీష్ భాషలు మా తమ్ముడికి నేనే నేర్పించాను. వేసవి సెలవుల చివరిలో బీచ్‌కి వెళ్ళాము. ఇలా ఈ వేసవి సెలవులు చాలా సరదాగా గడిచిపోయాయి.

– వి.దీక్ష,
6వ తరగతి,
అరవింద మోడల్ స్కూల్,
మంగళగిరి.

కథల పుస్తకం ప్రచురిస్తా

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు బి.విశ్వతేజ. నేను సిద్దిపేట జిల్లా అనంత సాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుచున్నాను. మా తరగతిలో నాది ప్రథమ స్థానం. నాకు కథలు రాయడం అంటే చాలా ఇష్టం. మా హిందీ ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య ఇచ్చిన ప్రోత్సాహంతో ఇప్పటివరకు 23 కథలు రాసాను. అందులో 15 కథలు ప్రముఖ పత్రికలలో ప్రచురించారు. (ఇందులో 8 కథలు ప్రజాశక్తి చిన్నారి, స్నేహ, వేసవి విడిదిలో వచ్చాయి) కొన్నింటికి నగదు బహుమతులు కూడా ఇచ్చారు. గత సంవత్సరం తెలంగాణ సారస్వత పరిషత్ హైదారాబాద్ వారు నిర్వహించిన కథల పోటీలో పాల్గొని నగదు బహుమతి పొందాను. సుగుణ సాహితి సమితి సిద్దిపేట నిర్వహించిన ఉగాది కథల పోటీలో బహుమతి సాధించాను. ఉపాధ్యాయులు, విద్యాధికారులు నన్ను ఎంతగానో మెచ్చుకుని బహుమతులు ఇచ్చారు. సమకాలీన విషయాల గురించి, బాలల స్వభావాల గురించి, సమాజంలో వస్తున్న మార్పుల గురించి కథలు రాస్తున్నాను. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగం సాధించి, గొప్ప రచయిత కావాలనేది నా ఆశయం. నేను రాసిన కథలతో ఒక పుస్తకం ప్రచురించాలనే కోరిక ఉంది. ఎవరైనా సహకారం అందిస్తే బాగుంటుందని అనుకుంటున్నాను. తరగతి విషయాలతో పాటు సాధారణ పరిజ్ఞానం, సామాజిక అంశాలు, దిన పత్రికల సమాచారం తెలుసుకోవడం నా అభిరుచులు. కథలు రాయడం, చెస్ ఆడడం నాకు ఇష్టం. మీ అందరి ఆశీస్సులు నాకు అందించాలని కోరుకుంటున్నాను.

– బి.విశ్వతేజ,
ఏడవ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా,
99590 07914.

నేను గీసిన బొమ్మ

ఎం.వర్షిణి,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తల్లీ బిడ్డ ఆరోగ్యం అత్యంత కీలకం

ఆరోగ్యమే మహాభాగ్యం. ఇది అందరికీ తెలిసిందే. అయినా తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. తల్లులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. మన ఆరోగ్యంపై వ్యక్తిగత పరిశుభ్రతతోపాటుగా పరిసరాల పరిశుభ్రతపై ఆధారపడి వుంటుంది. ప్రతిరోజూ మంచి ఆహారం వేడివేడిగా తీసుకోవడం మంచిది. పులిసిపోయినవి, మెత్తబడినవి తినకూడదు. మనం తినే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి కూడా ఆరోగ్యంపై పెను ప్రభావం చూపిస్తాయి. రోగ కారణాలు, సూక్ష్మజీవుల పాత్ర, రోగ నివారణ, టీకాల ఆవశ్యకత తదితర విషయాలపై తల్లులకు అవగాహన ఉంటే బిడ్డలను సురక్షితంగా ఉంచవచ్చు.

పిల్లల్ని కనడం ఒక ప్రకృతి సిద్ధమైన చర్యగా ఉన్నప్పటికీ పెంపకం కూడా సహజంగానే వస్తుందనుకోవటం పొరపాటు. ఇది ఓపికతో నేర్చుకోవాల్సిన ఒక కళ. ఆరోగ్యంగా ఉన్న తల్లి సంరక్షణలో పిల్లల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. శిశు రక్షణలో మాతృసంరక్షణ ఒక భాగం. శిశువుల ఆరోగ్యం, భద్రత, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. జీవిత ప్రారంభంలోనే సరైన సంరక్షణ లభిస్తే, శిశువులు ఆరోగ్యవంతమైన వ్యక్తులుగా ఎదుగుతారు. ఆనందం, ఆశ్చర్యం, ఆందోళనలతో పాటుగా మరెన్నో భావనలకు తెరతీస్తుంది శిశు జననం. ఈ శుభవార్త కుటుంబానికంతటికీ సంతోషంతోపాటు అనేక బరువు బాధ్యతలను మోసుకొని వస్తుంది. నూతన శిశువును ఈ ప్రపంచంలోకి ఆహ్వానించటం ఒక అపూర్వమైన మధురానుభవం. పిల్లల్ని కనడం ఒక ప్రకృతి సిద్ధమైన చర్యగా ఉన్నప్పటికీ పెంపకం కూడా సహజంగానే వస్తుందనుకోవటం పొరపాటు. ఇది ఓపికతో నేర్చుకోవాల్సిన ఒక కళ. ఆరోగ్యంగా ఉన్న తల్లి సంరక్షణలో పిల్లల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. శిశు రక్షణలో మాతృసంరక్షణ ఒక భాగం.

శిశు దశే కీలకం

జనన అనంతరం శిశువు శరీర, మానసిక అభివృద్ధి కోసం మొదటి కొన్ని సంవత్సరాలు అత్యంత కీలకం. తల్లి సరైన పోషకాహారం తీసుకోకపోవటం, సరైన ఆరోగ్య పద్ధతులను అవలంబించకపోవటం వల్ల శిశువులు సైతం దీర్ఘకాలిక అనారోగ్యాలకు గురవుతారు. ఫలితంగా తక్కువ బరువు, ప్రీమాచ్యూరిటీ (ముందుగా పుట్టడం), సంక్రమణలు, జనన లోపాలు వంటివి కూడా తలెత్తవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) లెక్కల ప్రకారం ఏటా 5 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్న పిల్లలు మరణిస్తున్నారని అంచనా. సరైన ఆరోగ్య సంరక్షణ, పోషణ, సంరక్షణ పద్ధతులను క్రమపద్ధతిలో పాటిస్తే ఈ మరణాల రేటును బాగా తగ్గించొచ్చు.

ఇవి పాటించటం మేలు

శిశువుల సంరక్షణలో కీలకంగా ఉండేది తల్లిదండ్రులే. సకాలంలో అందాల్సిన ఆహారాన్ని ఇవ్వటం, పిల్లల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం, అనారోగ్యంతో ఉంటే దానికి అవసరమైన చర్యలు తీసుకోవటంలో కీలక పాత్ర తల్లిదండ్రులదే. ఇలాంటి చర్యల ద్వారా మనం శిశువుల ఆరోగ్యం కాపాడుకోవడంలో భాగస్వాములమవుతాం.

వైద్యులను సంప్రదించడం: శిశువు ఆరోగ్యం, శరీర వికాసం గురించి ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించడం అవసరం. వారానికి ఒకసారైనా వైద్యుల పర్యవేక్షణ ఉంటే మంచిది.

పోషకాహారం: తల్లి పాలు ఆరునెలల వరకూ ఇవ్వాలి, ఆ తరువాత ఆహారంలో పోషకాలను జోడించాలి.

ఈ జాగ్రత్తలు పాటించటం మేలు

శిశు రక్షణలో ప్రసూతి (గైనకాలజీ), ఫిజియోథెరపీ ప్రాముఖ్యత కూడా కీలకమే.

పోషకాహారం : గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పోషకాహారం, శిశువుకి పుట్టుక తరువాత ఆరోగ్యాన్ని నిర్ధారిస్తుంది. ఈ సమయంలో ప్రసూతి నిపుణులు, ఫిజియోథెరపిస్టులు తల్లులకు సరైన ఆహార నియమాలు, వ్యాయామాలు సూచిస్తారు. తల్లి బలంగా ఉండడం ద్వారా పుట్టబోయే శిశువుకు కూడా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఎక్సర్‌సైజులు : ప్రసవం తర్వాత తల్లులు శిశువును ఎత్తుకోవటం, సరిగ్గా నిర్వహించడం వంటి పనుల్లో మరింత జాగ్రత్త అవసరం. ఫిజియోథెరపిస్టులు తల్లుల శరీరంలోని బలహీన ప్రాంతాలను మెరుగుపరిచే ప్రత్యేక వ్యాయామాలను సూచిస్తారు, తద్వారా శిశువుల సంరక్షణలో తల్లులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

వ్యాధి నిరోధకత: తల్లులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడంతో, శిశువులు కూడా వ్యాధులకు ఆమడ దూరంలో ఉంటారు. గర్భిణీలకు ఇవ్వబడే ఫిజియోథెరపీ సలహాలు, శిశువుల వ్యాధి నిరోధకతను పెంచుతాయి.

ఫిజియోథెరపీ : శిశువుల అభివృద్ధి కోసం ప్రత్యేకమైన ఫిజియోథెరపీ పద్ధతులు ఉంటాయి. ఉదాహరణకు, శిశువు మెడ, వెన్నెముక, కండరాల వికాసం మెరుగుపరచడానికి బేబీ బాండింగ్ యాక్టివిటీస్ సూచిస్తారు.

– డాక్టర్ ఎస్‌వి మోబీన్‌తాజ్
స్త్రీప్రసూతి, గర్భకోశ వైద్య నిపుణురాలు,
కెజిఎన్ హాస్పిటల్స్,
అనంతపురం .

ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 1000 రోజుల వరకూ పిల్లల సంరక్షణ ఎంతో కీలకం. ఈ కాలంలో అశ్రద్ధగా ఉన్నా పిల్లల్లో ఏదో ఒకటి లోపాలు కనిపించే అవకాశాలుంటాయి. పుట్టుక నుంచి శిశువు రెండో పుట్టినరోజు వరకూ ఈకాలంలో చిన్నారుల పెరుగుదల, అభివృద్ధి, ఆరోగ్యం అంతా అత్యంత కీలకం. ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలు, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, భద్రతపై శిశువుల జీవితం, సంక్షేమం, వారి భవిష్యత్తు సామర్థ్యంపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపిస్తాయి.

తల్లి పాలే మేలు : పుట్టిన వెంటనే తల్లి పాలతోనే ఆరంభం చేయాలి. తల్లి పాలలో శిశువుకి కావాల్సిన పోషకాలు అందుతాయి. ఆరునెలల పాటు కేవలం తల్లి పాలే ఇవ్వడం మంచిది.

టీకాలు తప్పనిసరి : అనేక వ్యాధుల్ని వ్యాక్సిన్ల ద్వారా అడ్డుకోవచ్చు. పిల్లలకు వ్యాధులు సులభంగా సోకుతాయి, అందుకే టీకాలు సమయానికి ఇవ్వడం అనివార్యం.

పరిశుభ్రతకు ప్రాధాన్యత : శిశువుల చుట్టూ పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం. పరిశుభ్రమైన నీరు, ఆహారం, ఆరోగ్యకరమైన పరిసరాలు వారికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అందిస్తాయి.

సరిపడా నిద్ర : శిశువులు సాధారణంగా ఎక్కువగా నిద్రపోవాలి. మంచి నిద్ర వారి ఆరోగ్యాన్ని కాపాడుతుంది, మానసిక వికాసాన్ని ప్రోత్సహిస్తుంది.

తల్లిదండ్రుల పాత్రా కీలకం : శిశువులను ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. వారి భవిష్యత్తు కోసం వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం చాలా ముఖ్యమైంది.

‘‘కుబేర’ కథ ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం ఉంది’

ధనుష్, నాగార్జున, రష్మిక కాంబోలో ‘కుబేర’ని తెరకెక్కించిన శేఖర్ కమ్ముల సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు మాట్లాడారు. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. కథాపరంగా తెలుగు, తమిళ భాషల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ‘ప్రపంచంలో బాగా డబ్బున్న వ్యక్తికి, ఏమీ లేని పేదవాడికి మధ్య జరిగే పోరాటాన్ని తెరపై చూపాలని అనిపిం చింది. ఇది చాలా పెద్ద పాయింట్. కథగా చెప్పడం కష్టం. దాన్ని జాగ్రత్తగా రాసుకొని తెరకెక్కించాను. ఒక్కమాటలో చెప్పాలంటే బిలియనీర్ వర్సెస్ బెగ్గర్ కథే ‘కుబేర’. లవ్‌స్టోరీ, లీడర్ లాంటి సినిమాలు తెరకెక్కించాను. కానీ, ఇలాంటి కథను ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం ఉందనిపించింది. దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇందులో రెండు ప్రపంచాలను చూపించాం. ఇది చూశాక అందరిలో మార్పు వస్తుంది. పొలిటికల్ యాంగిల్ ఉంటుంది. కానీ, సందర్భానికి అనుగుణంగా అలాంటి సన్నివేశాలు ఉంటాయి. ఎక్కువగా అయితే ఉండవు. కొన్ని పాత్రలు నాగార్జున మాత్రమే చేయాలి. కథ రాసుకునే సమయంలోనే ఆ పాత్రకు నాగార్జున అయితే బాగుంటుందని అనుకున్నాను. ఆయన్ని ఎన్నో పాత్రల్లో చూశాం. ఇందులో కొత్తగా కనిపిస్తారు. సినిమా చూశాక ధనుష్ మాత్రమే ఇలాంటి పాత్రను చేయగలరని అందరికీ తెలుస్తుంది. అద్భుతంగా నటించారు. మరొకరిని ఆ పాత్రలో ఊహించలేం. ఇలాంటి కథను అంగీకరించడమే గొప్ప విషయం. చాలా కష్టపడ్డారు. నేను ఎప్పుడూ నా మార్క్ చూపించాలని అనుకోను. ఇది లవ్‌స్టోరీ కాదు. సినిమా చూడగానే అందరూ ఆశ్చర్యపోతారు. గతంలో సినిమాల కంటే ఇది పదిరెట్లు గొప్పగా ఉంటుంది. దేవీశ్రీ ప్రసాద్ మంచి సంగీతం అందించారు. ఆయనతో వర్క్ చేయడం ఎప్పటికీ మర్చిపోలేను. ధనుష్ ఎంత పెద్ద డైలాగు అయినా నేర్చుకుంటాడు. సింగిల్ టేక్‌లో చెప్పేస్తాడు. గొప్ప నటుడు. ఈ సినిమా షూటింగ్ ఎక్కువగా ముంబయిలో చేశాం. అది కష్టంగా అనిపించింది. అక్కడ రద్దీ ఎక్కువ. ఒకప్రదేశం నుంచి మరోదగ్గరికి వెళ్లాలంటే చాలాసేపు పడుతుంది. అక్కడ పర్మిషన్ దొరకడం కూడా కష్టమే. ఈ సినిమాలో ఎక్కువ మంది స్టార్స్ ఉన్నారు. అందుకే కొంచెం ఎక్కువ సమయం పట్టింది. వాళ్ల షెడ్యూల్స్ ప్రకారం మార్పులు చేసుకుంటూ చేశాను. కథ పరంగా ముంబయిలోనే లొకేషన్స్ సరిపోతాయని అనిపించింది. అందుకే అక్కడ ఎక్కువ భాగం చిత్రీకరించాను. నేనెప్పుడూ సింపుల్‌గా ఉంటాను. సినిమాలు కూడా అలానే తీశాను. నాకున్న ఆర్థిక పరిస్థితి, నా బ్యాక్‌గ్రౌండ్ అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని తీస్తాను. ఒకప్పుడు స్నేహితులందరి దగ్గర డబ్బులు తీసుకొని సినిమాలు తీసేవాడిని. ఆరోజులు ఇంకా గుర్తే. కాకపోతే ఎప్పుడూ ఎదురుదెబ్బలు తగల్లేదు. అది నా అదృష్టం. ఆడియన్స్ ఎంతో అభిమానం చూపించారు. వారందరికీ కృతజ్ఞతలు. ఈ స్థాయికి వచ్చిన జర్నీ తలచుకుంటే ఒక్కోసారి భావోద్వేగానికి గురవుతాను. నేనెప్పుడూ ఏదీ ఆశించలేదు. సినిమాల విషయంలో కూడా లాభాల్లో నాకు ఇంత పర్సంటేజ్ కావాలి అని ఎప్పుడూ అడగను. నా రెమ్యు నరేషన్ తీసుకుంటానంతే. దాని వల్ల చాలా నష్టపోయాను. అయినా నాకు ఏ విషయంలోనూ బాధలేదు. అన్నిటికంటే ఆడియన్స్ ప్రేమ ముఖ్యం’ అన్నారు.

విశ్వంభర ‘స్పెషల్’కు భీమ్స్!

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న ‘విశ్వంభర’ చిత్రానికి వశిష్ట దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉండగా దానికి సంగీతం అందించేందుకు యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్‌ను మేకర్స్ రంగంలోకి దించబోతున్నారు. సినిమా మొత్తానికి కీరవాణి సంగీతం అందించినా.. ఆ ఒక్క పాట మాత్రం భీమ్స్ కంపోజ్ చేయబోతున్నారు. చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఫోక్, ఐటమ్స్ సాంగ్స్ చేయడంలో భీమ్స్ స్పెషలిస్ట్. చాలాకాలం విరామం తర్వాత చిరంజీవి నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ యాక్షన్ మూవీ ఇది. ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్పెషల్ సాంగ్ మినహా షుటింగ్ అంతా పూర్తయింది. అన్ని కుదిరితే ఆగస్ట్ నెలాఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది.

పాటల చిత్రీకరణలో...

వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ బ్యానర్‌పై ‘కాకర్ల ఎంఆర్’ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ‘వెస్ట్రన్ లవ్’. కథానాయకుడిగా రావి రామ్‌చరణ్, కథానాయికగా మాహి నటిస్తున్నారు. విష్ణుశ్రీ, సత్య, పవన్, సుమన్, అశోక్‌కుమార్, రవిప్రకాష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ పిఎల్‌కె రెడ్డి. సంగీతం ప్రమోద్ పులిగిల్ల, ఎడిటర్‌గా నందమూరి హరి వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో మొత్తం 7 పాటలు ఉండగా దాదాపు అన్నీ చిత్రీకరణ పూర్తయ్యింది. సోమ, మంగళవారాల్లో పెండింగ్ పాటల చిత్రీకరణ చేశామనీ, మిగతా ప్యాచ్‌వర్కులు రెండ్రోజుల్లో పూర్తిచేస్తామని నిర్మాతలు రావి సౌజన్య, కాకర్ల ఎంఆర్ తెలిపారు.

నాల్గో స్థానంలో శుభ్‌మన్

- రాహుల్, జడేజాపై అదనపు భారం
- 3వ స్థానంపై రాని స్పష్టత
- వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఉద్ఘాటన

లండన్: టీమిండియా నయా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాల్గో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడని వికెట్ కీపర్ రిషబ్ పంత్ అభిప్రాయపడ్డాడు. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన నేపథ్యంలో మిడిలార్డర్‌లో బ్యాటింగ్ భారాన్ని మోయాల్సిన బాధ్యత శుభ్‌మన్‌పై పడిందని తెలిపాడు. తాను మాత్రం 5వ స్థానంలోనే బ్యాటింగ్‌కు వస్తానని, కానీ 3వ స్థానంలో ఎవరు బ్యాటింగ్‌కు దిగుతారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదన్నాడు. గతంలో కోహ్లి 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 7,564 పరుగులు చేసిన విషయాన్ని పంత్ బుధవారం జరిగిన మీడియా సమావేశంలో తెలిపాడు. అలాగే ప్లేయింగ్ ఎలెవెన్‌ను సెలెక్షన్ కమిటీ గురువారం ప్రకటించే ఛాన్స్ ఉందని, ఆ తర్వాత ఎవరెవరు ఏ ఏ స్థానాల్లో బ్యాటింగ్‌కు దిగుతారనే అంశం స్పష్టమౌతుందన్నాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ లేకుండా టీమిండియా తొలిసారి విదేశాల్లో టెస్ట్ సిరీస్‌కు వెళ్లిందని, దీంతో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ బ్యాటింగ్ బాధ్యతలు తమ భుజాలపై వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నాడు. అలాగే ఇంగ్లండ్‌లో మొదటిసారి క్రికెట్ ఆడనున్న యశస్వి జైస్వాల్, 2017లో చివరిసారిగా టెస్ట్ మ్యాచ్ ఆడిన కరుణ్ నాయర్ అదనపు బాధ్యతలను మోయాల్సి ఉంటుంది. ఇక టీమిండియా జట్టు సోమవారం నుంచి లీడ్స్‌లో, ఇంగ్లండ్ జట్టు హెడింగ్లీలో శిక్షణ సెషన్ నిర్వహిస్తున్నాయి. అయితే గత రెండు దశాబ్దాలుగా భారత్ ఇక్కడ పెద్దగా టెస్ట్ మ్యాచ్‌లు ఆడలేదు. ఇదే తొలిసారి. టీమిండియా 37వ టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికైన విషయం తెలిసిందే. భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య శుక్రవారం నుంచి తొలిటెస్ట్ ప్రారంభం కానుంది.

కెప్టెన్ రాణిస్తేనే...

ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌తో సారథ్య బాధ్యతలు చేపడుతున్న శుభ్‌మన్ గిల్ పైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొనింది. అటు కెప్టెన్‌గానూ.. ఇటు బ్యాటర్‌గానూ అతడు ఎలా రాణిస్తాడోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ జట్టు శుభ్‌మన్ గిల్‌నే టార్గెట్ చేసుకుంటుందని ఆ జట్టు మాజీ ఆటగాడు నిక్ నైట్ హెచ్చరించాడు. స్వదేశంలో శుభ్‌మన్ గిల్ బాగానే రాణించినప్పటికీ.. విదేశాల్లో మాత్రం అతడి ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదని చెప్పాలి. విదేశాల్లో ఆడిన 15 మ్యాచ్‌ల్లో అతడు 27.53 సగటుతో 716 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక సెంచరీ ఉంది. అదే సొంత గడ్డపై 17 మ్యాచ్‌ల్లో 42 సగటుతో 1,177 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ జట్టు శుభ్‌మన్ గిల్‌ను లక్ష్యంగా చేసుకుంటుందని నిక్ పేర్కొన్నాడు. “శుభ్‌మన్ గిల్‌కు ఇది పెద్ద సిరీస్ అవుతుంది. నేను అతడికి పెద్ద అభిమానిని. అండర్–19 వరల్డ్ కప్ నుంచి అతడి ఆటను చూస్తున్నాను. అతడు గొప్ప ప్రదర్శన చేస్తాడని అప్పుడే అనుకున్నాను” అని నిక్ కొనియాడాడు. గిల్ బ్యాటింగ్‌లో టెక్నిక్‌ను మరింత మెరుగుపర్చుకోవాలని.. ఆతిథ్య జట్టు ఇంగ్లండ్ దానిపైనే ఫోకస్ చేసే అవకాశముందని సూచించాడు.

పేసర్లకు అనుకూలం..

పిచ్ తొలిరోజు పేసర్లకు అనుకూలించడం ఖాయమని లీడ్స్ గ్రౌండ్స్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ వివరించాడు. ‘ఇక్కడ అసాధారణంగా పొడి వాతావరణం వల్ల మంచి సర్ఫేస్ ఉన్న పిచ్ ఉండొచ్చు. ఇంగ్లండ్ టీమ్ కూడా ఇలాంటి ఉపరితలం ఉండే పిచ్‌నే కోరుకుంటోంది. తొలి రోజున పిచ్ ఫాస్ట్ బౌలర్లకు సహాయపడుతుంది. ఈ తర్వాత వేడి కారణంగా క్రమంగా ఫ్లాట్‌గా మారొచ్చు. ఇంగ్లండ్ బజ్‌బాల్ క్రికెట్‌కు సరిపోవడమే కాకుండా.. అంతగా అనుభవం లేని టీమిండియా బ్యాటింగ్ లైనప్‌కు పరీక్ష పెట్టొచ్చు’ అని పేర్కొన్నాడు. గతంలో ఎప్పుడైనా సరే ఈ మైదానంలో టెస్ట్ సిరీస్ మధ్యలోని మ్యాచ్‌లను నిర్వహించేవారు. కానీ ఈసారి మొదటి మ్యాచ్‌తో సిరీస్ ఇక్కడే ప్రారంభం కాబోతోంది.

జట్టును ప్రకటించిన ఇంగ్లండ్

భారత్‌తో రేపటినుంచి ప్రారంభమయ్యే తొలిటెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు రెండ్రోజుల ముందే తుది జట్టును ప్రకటించింది. 21ఏళ్ల యువ ఆల్‌రౌండర్ జాకోబ్ బేథెల్‌ను ప్రక్కన పెట్టిన ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. స్టార్ బ్యాటర్ ఓలీ పోప్‌కు చోటు కల్పించింది. అతడు 3వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగనున్నట్లు, ఆ తర్వాత 4వ స్థానంలో సీనియర్ బ్యాటర్ రూట్ క్రీజ్‌లోకి వస్తాడని పేర్కొంది. కెప్టెన్‌గా బెన్ స్టోక్స్, వికెట్ కీపర్‌గా జామీ స్మిత్ బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు ఇసిబి పేర్కొంది.

తొలిటెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు

స్టోక్స్(కెప్టెన్), క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్మిత్(వికెట్ కీపర్), వోక్స్, కర్సే, టోంగే, బషీర్.

బంగ్లాదేశ్ 484/9

- లింటన్ దాస్ సెంచరీ మిస్
- శ్రీలంకతో తొలిటెస్ట్

గాలే: శ్రీలంకతో జరుగుతున్న తొలిటెస్ట్‌లో బంగ్లాదేశ్ జట్టు భారీస్కోర్ నమోదు చేసింది. వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీం(163)కి తోడు కెప్టెన్ నజ్ముల్ శాంటో(148) భారీ శతకాలతో రాణించారు. లింటన్ దాస్(90) తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నా.. బంగ్లాదేశ్ జట్టు రెండో రోజు ఆట నిలిచే సమయానికి 9 వికెట్ల నష్టానికి 484పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 292పరుగులతో రెండోరోజు ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా జట్టును ముష్ఫికర్, నజ్ముల్ ఆదుకున్నారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 264పరుగులు జతచేశారు. ఈ క్రమంలోనే ముష్ఫికర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి ఒక్క బంతి కూడా బౌల్ చేయకుండా 15,502 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అంతకు ముందు ఈ రికార్డు ఆడం గిల్‌క్రిస్ట్ పేరిట ఉండేది. అతడు తన కెరీర్‌లో ఒక్క బంతి కూడా వేయకుండా 15,461 పరుగులు సాధించాడు. తాజాగా ఆ రికార్డును ముష్ఫికర్ అధిగమించాడు. తొలిరోజు ఆటలో భాగంగా 105 పరుగులు చేసిన ముష్ఫికర్ రహీం.. బుధవారం నాటి రెండో రోజు ఆట సందర్భంగా 150 పరుగుల మార్కును అధిగమించాడు. తొలి ఇన్నింగ్స్‌లో మొత్తంగా 350 బంతులు ఎదుర్కొని 163 పరుగులు సాధించాడు. ఇక బంగ్లాదేశ్ తరపున టెస్టుల్లో అత్యధికసార్లు 150కి పైగా స్కోర్లు సాధించిన క్రికెటర్‌గానూ ముష్ఫికర్ రహీం కొనసాగుతున్నాడు. అతడు ఏడుసార్లు ఈ ఫీట్ నమోదు చేయగా.. మొమినుల్ హక్ మూడుసార్లు 150కి పైగా స్కోర్ చేసి రెండో స్థానంలో ఉన్నాడు. రెండో రోజు ఆట నిలిచే సమయానికి హసన్ మహ్మద్, నహీద్ రాణా క్రీజ్‌లో ఉన్నారు. శ్రీలంక బౌలర్లు ఫెర్నాండో, ప్రియనాథ్, రత్నాయకేలకు మూడేసి వికెట్లు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68